


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


## చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్ కేసు.. మాంసం నింపిన బొమ్మలతో కొత్త ఎత్తుగడ!




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 161 | బుధవారం 17 - 06 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028


## హోంమంత్రి అనితపై గుడివాడ కామెంట్స్



దిగజారిపోయి మహిళలపై విమర్శలు సరికాదు

ఇది యావత్తు మహిళా లోకానికే అవమానం

అమరన్‌నాథ్ వ్యాఖ్యలపై మండిపడ్డ డిప్యూటీ సీఎం

## గాయని శ్రీలలిత నివాసానికి ప్రహ్లాద్ జోషి



12 సుపరిపాలన పుస్తకాన్ని అందించిన కేంద్రమంత్రి

ఇంద్రకీలాద్రిపై అమ్మవారికి ప్రత్యేక పూజలు

## అద్భుత నగరంగా అమరావతి నిర్మాణం



అంతర్జాతీయ మౌలిక వసతులతో తీర్చిదిద్దుతున్నాం

పీపుల్ ఫస్ట్ మా విధానంలో

నాలెడ్జ్ సిటీగా చేస్తున్నాం

జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థల ఏర్పాటు

క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రత్యేక ఆకర్షణలు

లీడర్‌షిప్ ప్లీనరీ-2లో చంద్రబాబు ప్రసంగం

## 'దిశ' ఫెయిల్.. 'శక్తి' సక్సెస్:

ఏపీలో క్రైం రేటు 14.1 శాతం తగ్గిందన్న అనిత

గత ప్రభుత్వ హయాంలో దిశ చట్టం అమలు కాలేదని విమర్శ

ఇప్పటి వరకు 2,366 గంజాయి కేసులు నమోదు చేశామని వెల్లడి



## బీసీలపై కక్షపూరిత చర్యలకు పాల్పడ్డ జగన్



అమర్‌నాథ్ గౌడ్ హత్యే ఇందుకు నిదర్శనం

మంత్రి లోకేశ్ ఘాటు విమర్శలు

జగన్ హయాంలో బీసీలకు అన్యాయం జరిగిందని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఫైర్ అయ్యారు. వైసీపీ హయాంలో బీసీలపై కక్షపూరిత చర్యలకు పాల్పడ్డారని దుయ్యబట్టారు. బీసీలు అంటే జగన్‌కు ఎంత కక్షో అమర్నాథ్ గౌడ్ సజీవదహనం నిరూపించిందని పేర్కొన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలపై గొడ్డలి పార్టీ కక్షగట్టిందని ధ్వజమెత్తారు. మంగళవారం అమరావతి వేదికగా మీడియాతో మంత్రి లోకేశ్ మాట్లాడారు. తన అక్కను గొడ్డలి పార్టీ నేతలు వేధిస్తుంటే ప్రశ్నించినందుకు జూన్ 15, 2023న బడికి వెళ్తున్న 15ఏళ్ల బీసీ బాలుడు అమర్నాథ్ గౌడ్‌ను దారుణంగా కొట్టి, కట్టేసి సజీవ దహనం చేశారని మండిపడ్డారు.నాడు గొడ్డలి పార్టీ నిందితులను రక్షించేందుకు ప్రయత్నించిందని మంత్రి లోకేశ్ ఆగ్రహించారు. అన్యాయంగా అమర్‌నాథ్ గౌడ్‌ని చంపేశారని.. ఆయన మృతిచెంది మూడేళ్లు అవుతోందని తెలిపారు. గొడ్డలి పార్టీ వల్ల అన్నివిధాలా నష్టపోయిన అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి నారా లోకేశ్ భరోసా కల్పించారు. వైసీపీ పైశాచికత్వానికి పరాకాష్ట అమర్నాథ్ గౌడ్ హత్య అని మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు.

## సువేందు అధికారిపై మమత న్యాయపోరాటం..

భవానీపూర్ ఎన్నికల ఫలితంపై హైకోర్టులో మమత పిటిషన్

సీఎం సువేందు అధికారి విజయాన్ని సవాల్ చేసిన దీదీ

15,015 ఓట్ల తేడాతో ఓటమిని ప్రశ్నించిన తృణమూల్ అధినేత్రి

కౌంటింగ్‌లో అక్రమాలు జరిగాయని పిటిషన్‌లో ఆరోపణ

2021 నందిగ్రామ్ తర్వాత మళ్లీ సువేందుపై కోర్టుకెక్కిన మమత



పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి న్యాయపోరాటానికి దిగారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భవానీపూర్ నియోజకవర్గ ఫలితాన్ని సవాల్ చేస్తూ ఆమె మంగళవారం కలకత్తా హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను ధృవీకరించేందుకు మమత స్వయంగా హైకోర్టు రిజిస్ట్రీకి హాజరైనట్లు సమాచారం. ఇటీవల జరిగిన ఎన్నికల్లో భవానీపూర్ నియోజకవర్గంలో బీజేపీ నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి సువేందు అధికారి చేతిలో మమతా బెనర్జీ 15,015 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఒకప్పుడు టీఎంసీకి కంచుకోటగా ఉన్న ఈ స్థానంలో ఓడిపోవడాన్ని ఆమె జీర్ణించుకోలేకపోతున్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని, ఫలితాలపై న్యాయవిచారణ జరపాలని ఆమె తన పిటిషన్‌లో కోరారు. ఎన్నికలకు సంబంధించిన రికార్డులను భద్రపరచాలని కూడా విజ్ఞప్తి చేశారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సాధించి, సువేందు అధికారి నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే, సువేందు అధికారిపై మమతా బెనర్జీ కోర్టును ఆశ్రయించడం ఇది రెండోసారి.

## రాహుల్ గాంధీకి రాజకీయ పరిణతి లేదు..

కాంగ్రెస్‌పై డీఎంకే ఘాటు విమర్శలు



మురసోలి పత్రికలో విమర్శలు

ప్రతిపక్షాల ఐక్యతపై రాహుల్ మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా

ఆయన వల్లే ఇండియా కూటమి దెబ్బతింటోందని వ్యాఖ్య

కాంగ్రెస్ అధిష్ఠానం వల్లే తమిళనాడులో టీవీకేకు మద్దతిచ్చారని ఆరోపణ

ప్రజల తీర్పునే గౌరవించామని కాంగ్రెస్ వివరణ

## పవన్‌పై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ తీవ్ర విమర్శలు..



పవన్ కల్యాణ్ బీజేపీ చేతిలో కీలుబొమ్మ

అంటూ టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ విమర్శ

తెలంగాణపై బాధ్యతారహిత వ్యాఖ్యలు

సరికాదని పవన్‌కు హెచ్చరిక

## కేసీఆర్ హయాంలో స్కీంలు.. కాంగ్రెస్‌లో స్కాంలు

కరోనాలో కూడా కెసిఆర్ రైతుబంధు ఏనాడూ ఆపలేదు

రేవంత్ ముమ్మాటికీ ఎగవేతల రేవంత్ అంటాను

కేసులు పెట్టినా భయపడేది లేదన్న హరీష్ రావు



## అమెరికా-ఇరాన్ ఒప్పందంలో తెరవెనుక చక్రం తిప్పిన ఖతార్!

అమెరికా, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం

ఒప్పందం వెనుక కీలక పాత్ర పోషించిన ఖతార్

తిరిగి ప్రారంభం కానున్న హర్ముజ్ జలసంధి రవాణా

జెనీవాలో ఒప్పందంపై అధికారికంగా సంతకాలకు సన్నాహాలు



అమెరికా, ఇరాన్ దేశాల మధ్య గత వంద రోజులకు పైగా కొనసాగుతున్న తీవ్ర ఉద్రిక్తతలకు తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది.

## రాహుల్ గాంధీకి రాజకీయ పరిణతి లేదు..

ఒకప్పుడు మిత్రపక్షంగా కలిసి నడిచిన కాంగ్రెస్‌పై డీఎంకే తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రతిపక్ష ఐక్యత గురించి మాట్లాడే రాహుల్ గాంధీనే దాన్ని దెబ్బతీశారని ఆరోపించింది. డీఎంకే అధికారిక పత్రిక 'మురసోలి' సంపాదకీయంతో పాటు పార్టీ ఐటీ విభాగం కూడా రాహుల్‌పై ఘాటు విమర్శలు గుప్పించింది.రాజకీయంగా కష్టకాలంలో కాంగ్రెస్‌ను భుజాన మోసి నిలబెట్టామని, పరిస్థితులు కాస్త మారగానే ఆ పార్టీ తమను వదిలేసిందని డీఎంకే ఐటీ విభాగం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. చివర్లో రాహుల్ గాంధీని 'ఓ పెద్ద జోక్'గా అభివర్ణించింది. ప్రతిపక్షాల ఐక్యత గురించి రాహుల్ చేస్తున్న వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని మురసోలి సంపాదకీయంలో పేర్కొంది. వివిధ రాష్ట్రాల్లో ప్రతిపక్ష కూటమిలో చీలికలకు కారణమైన వ్యక్తే ఇప్పుడు ఐక్యతపై ఉపన్యాసాలు ఇస్తున్నారని వ్యాఖ్యానించింది. ముఖ్యంగా కేరళలో వామపక్షాలపై రాహుల్ చేసిన విమర్శలను ప్రస్తావిస్తూ, మిత్రపక్షాలనే లక్ష్యంగా చేసుకోవడం కాంగ్రెస్‌కు అలవాటైందని ఆరోపించింది.తమిళనాడులో జరిగిన రాజకీయ పరిణామాలను కూడా సంపాదకీయంలో ప్రస్తావించింది. డీఎంకే కూటమిలో పోటీ చేసి గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తర్వాత విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వంలో చేరడం వెనుక కాంగ్రెస్ అధిష్ఠానం సమ్మతి ఉందని ఆరోపించింది. ఇలాంటి చర్యల తర్వాత కూడా రాహుల్ గాంధీ ప్రతిపక్ష పార్టీలకు ఐక్యతపై హామీలు ఇవ్వడం విశ్వసనీయంగా కనిపించడం లేదని వ్యాఖ్యానించింది. ప్రతిపక్ష కూటమిలో ప్రస్తుతం కనిపిస్తున్న విభేదాలకు ప్రధాన కారణం కాంగ్రెస్ వైఖరేనని మురసోలి ఆరోపించింది. రాహుల్ గాంధీ రాజకీయ అపరిపక్వత, స్థిరమైన వ్యూహం లేకపోవడమే ఇండియా కూటమిలో సమస్యలకు దారితీసిందని విమర్శించింది. అయితే డీఎంకే ఆరోపణలను కాంగ్రెస్ వర్గాలు ఖండించాయి. తమిళనాడులో ప్రజల తీర్పును గౌరవించే నిర్ణయాలు తీసుకున్నామని, డీఎంకే లేదా ఇండియా కూటమిని బలహీనపరిచే చర్యలు చేపట్టలేదని వివరించాయి.

## పవన్‌పై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ తీవ్ర విమర్శలు..

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్ కల్యాణ్ బీజేపీ చేతిలో కీలుబొమ్మలా మారారని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, ఇక్కడి ప్రజల గురించి పవన్ బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని, ఇటువంటి వ్యాఖ్యలను ఎంతమాత్రం సహించేది లేదని ఆయన హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. దశాబ్దాల పోరాటం, అనేక త్యాగాల ఫలితంగా, సోనియా గాంధీ చొరవతో కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని గుర్తుచేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న పవన్ కల్యాణ్, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. పవన్ తన మాటల ద్వారా బీజేపీ అజెండానే అమలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఏపీ ఉప ముఖ్యమంత్రిగా తన బాధ్యతలపై దృష్టి సారించాలి తప్ప, తెలంగాణ వ్యవహారాల్లో అనవసరంగా జోక్యం చేసుకోవద్దని పవన్‌కు సూచించారు. తెలంగాణలో జనసేన పార్టీని విస్తరించే వ్యూహంలో భాగంగానే పవన్ ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇదే సమయంలో పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మౌనంగా ఉండటాన్ని ఆయన తప్పుబట్టారు. వారి మధ్య ఏవైనా లోపాయికారీ ఒప్పందాలు ఉన్నాయా? అని మహేశ్ గౌడ్ అనుమానం వ్యక్తం చేశారు.

## అమెరికా-ఇరాన్ ఒప్పందంలో తెరవెనుక చక్రం తిప్పిన ఖతార్!

ఈ ఒప్పందం వెనుక ఖతార్ జరిపిన నిరంతర, రహస్య దౌత్యం కీలక పాత్ర పోషించినట్లు అంతర్జాతీయ కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఒప్పందంతో కీలకమైన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడంతో పాటు, అణు చర్చల పునరుద్ధరణకు మార్గం సుగమం కానుంది.ఈ ఒప్పందంపై త్వరలోనే తటస్థ వేదికైన జెనీవాలో అధికారికంగా సంతకాలు జరగనున్నాయి. ఒప్పందం నిబంధనల ప్రకారం, ఇరు పక్షాలు తక్షణమే కాల్పుల విరమణను పాటించాల్సి ఉంటుంది. దీనితో పాటు, ప్రపంచ ఇంధన సరఫరాకు అంతరాయం కలిగించిన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలను పునరుద్ధరించనున్నారు. కొన్ని ధ్రువీకరించదగిన చర్యలకు ప్రతిఫలంగా ఇరాన్‌పై ఉన్న ఆంక్షలను దశలవారీగా సడలించేందుకు కూడా అంగీకారం కుదిరింది.2026 ప్రారంభం నుంచి అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య చోటుచేసుకున్న సైనిక చర్యలతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పరాకాష్ఠకు చేరాయి. చర్చల ప్రారంభ దశలో పాకిస్థాన్ చొరవ తీసుకుని ఇరు దేశాల మధ్య సంప్రదింపులకు వేదిక కల్పించింది. అయితే, అణు పరిమితులు, యురేనియం నిల్వలు వంటి క్లిష్టమైన సాంకేతిక అంశాలపై ఏకాభిప్రాయం సాధించడంలో ఆ ప్రయత్నాలు పూర్తిస్థాయిలో ఫలించలేదు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఖతార్ రంగంలోకి దిగింది. అమెరికా, ఇరాన్ దేశాలతో సత్సంబంధాలు కలిగిన ఖతార్ రాయబారులు, ఇరు దేశాల మధ్య రహస్య మంతనాలు జరిపి, ఒప్పందంలోని సంక్లిష్టాంశాలపై ఏకాభిప్రాయం సాధించడంలో సఫలమయ్యారు. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు, నావికాదళ దిగ్బంధనాన్ని సడలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధ్రువీకరించారు. నెలల తరబడి కొనసాగిన అనిశ్చితి తర్వాత ఈ ఒప్పందం ఒక చారిత్రాత్మక ముందడుగుగా దౌత్యవేత్తలు భావిస్తున్నారు.

## గచ్చిబౌలి స్టేడియంలో రగ్బీ ప్రీమియర్ లీగ్ లాంఛనంగా ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి

హెచ్.ఎస్. బి.సి రగ్బీ ప్రీమియర్ లీగ్ ను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలోని ప్రారంభోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... రగ్బీ ఆట కోసం ఇక్కడికి విచ్చేసిన ఆటగాళ్లకు, కోచ్‌లకు, అధికారులకు, ఫ్రాంచైజీ యజమానులకు, భాగస్వాములకు, అభిమానులకు అభినందనలు తెలిపారు. రగ్బీ ప్రీమియర్ లీగ్‌ను నిర్వహించడానికి జి.ఎమ్.ఆర్ స్పోర్ట్స్ హైదరాబాద్‌ను ఎంచుకున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. 6 పురుషుల జట్లతో పాటు 4 మహిళల జట్లు ఈ ఈ లీగ్ లో పాల్గొనడం ఆనందదాయకమన్నారు . ఇది రగ్బీ ఆటకే కాకుండా భారతదేశంలో మహిళా క్రీడల అభివృద్ధికి కూడా ఒక ముఖ్యమైన ముందడుగని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమాన్ని సాకారం చేయడానికి కలిసి పనిచేసిన జి.ఎమ్.ఆర్ స్పోర్ట్స్, రాహుల్ బోస్, రగ్బీ ఇండియా, ఫ్రాంచైజీ యజమానులు, స్పాన్సర్లు, బ్రాడ్‌కాస్టర్లు,భాగస్వాములందరికీ మంత్రి విషెస్ తెలియజేశారు. క్రీడలను ప్రోత్సహించే, యువ అ÷-లథెట్లకు స్ఫూర్తినిచ్చే భారతదేశ క్రీడా రంగాన్ని బలోపేతం చేసే ప్రతి ప్రయత్నానికి మద్దతు ఇవ్వడానికి తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండి సోనీ బాలాదేవి, నిర్వాహకులు పాల్గొన్నారు.

## హోంమంత్రి అనితపై గుడివాడ కామెంట్స్

రాజకీయాల్లో విమర్శలు విధానపరంగానే ఉండాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి అనితపై ఓ మాజీ మంత్రి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహిళల కట్టుబొట్టుపై కామెంట్స్ చేసే స్థాయికి ఆ నాయకుడి పార్టీవారు దిగజారిపోయారంటూ వ్యాఖ్యానించారు. స్త్రీల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఆ వ్యాఖ్యలు కేవలం హోం మంత్రిని అన్నట్టే కాదని.. సగటు మహిళలందరినీ కించపరచినట్లే అని పవన్ అన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారి నోటి నుంచి వచ్చే ప్రతి మాటను పౌర సమాజం గమనిస్తోందనే విషయాన్ని మరచిపోవద్దని పవన్ అన్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు ఉంటాయని... అవి విధానపరంగానే ఉండాలన్నారు. ఒక పాలసీ నచ్చకపోతే ఆ పాలసీ విషయంపైనే విమర్శించాలన్నారు. వాచలత్వంతో ఇళ్లలోని స్త్రీలను కూడా కించపరిచే నైజం ఉన్న పార్టీ చేసే కామెంట్స్‌లను బలంగా తిప్పికొట్టేటప్పుడు వాళ్లు చేస్తున్న వ్యాఖ్యల్లో ఎంతటి అభ్యంతరకరమైన విషయం ఉందో ప్రజలకు తెలియజెప్పాలని కూటమి నేతలకు సూచించారు. కూటమి నేతలందరూ పౌర సమాజం హర్షించే భాషలో మాట్లాడి బలంగా బదులివ్వాలన్నారు. అవతలి పార్టీవాళ్ల మాదిరి దిగజారుడు భాష, అర్థరహిత వ్యాఖ్యలు కూటమి నేతలకు అవసరం లేదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

## గాయని శ్రీలలిత నివాసానికి ప్రహ్లాద్ జోషి

విజయవాడలో వివిధ కార్యక్రమాలలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ యువ గాయని శ్రీలలిత నివాసానికి కేంద్ర మంత్రి విచ్చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని 12 ఏళ్ల సుపరిపాలన, సాధించిన విజయాలపై రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని శ్రీలలితకు అందజేశారు. కర్ణాటక, హిందుస్తానీ సంగీత శైలులు రెండింటిలోనూ రాణిస్తున్న శ్రీలలితను ప్రహ్లాద్ జోషి అభినందించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. రెండు విభిన్న సంగీత పక్రియలను నేర్చుకోవడం ఎంతో కష్టతరమన్నారు. గతంలో ప్రధాని మోదీ స్వయంగా శ్రీలలిత ప్రతిభను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రశంసించారని తెలిపారు. కర్ణాటకలో ధార్వాడ్.. హిందుస్తానీ సంగీతానికి ఎందరో మహానుభావులను అందించిందన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాని మోదీ సాధించిన అద్భుత ప్రగతిని, ప్రపంచ సంక్షోభాల సమయంలోనూ దేశాన్ని సమర్థవంతంగా నడిపించిన తీరు గురించి అందరూ తెలుసుకోవాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, ఇక్కడి రాజధానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం ఉదయం ఇంద్రకీలాద్రి చేరుకున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు ఆలయ మర్యాదలతో ఆలయ అర్చకులు, దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని, వేద పండితుల చేత వేద ఆశీర్వచనం పొందారు. అనంతరం కేంద్ర మంత్రికి అమ్మవారి లడ్డూ ప్రసాదాన్ని, చిత్రపటాన్ని ఆలయ అధికారులు అందజేశారు.

## అద్భుత నగరంగా అమరావతి నిర్మాణం

పీపుల్ ఫస్ట్ మా విధానమని... ఈక్విటీ, నేచర్, ఆపర్చునిటీ, లివబుల్ సిటీగా అమరావతి ఉంటుందని సీఎం చంద్రబాబు తెలిపారు. అంతర్జాతీయ మౌలిక వసతులతో, అవకాశాల వేదికగా అమరావతిని తీర్చిదిద్దుతున్నామన్నారు. సింగపూర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. 'వరల్డ్ సిటీస్ సమ్మిట్'లో పాల్గొన్న సీఎం.. లీడర్‌షిప్ ప్లీనరీ-2లో 'కెన్ స్మార్ట్ సిటీస్ లవ్ హ్యూమన్స్' అనే అంశంపై ప్రసంగించారు. అమరావతిని నాలెడ్జ్ సిటీగా చేస్తున్నామని.. జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలను తీసుకువస్తున్నామని అన్నారు. క్వాంటం కంప్యూటింగ్ హబ్, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రత్యేక ఆకర్షణలన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా అమరావతి నిర్మాణం అవుతోందన్నారు. అమరావతిని సందర్శించి.. సరికొత్త ఆలోచనలతో అవకాశాలను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. 25 ఏళ్ల క్రితం ఐటీ గురించి మాట్లాడానని... ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్‌తో ఈరోజు తెలుగువాళ్లు తలసరి ఆదాయంలో ముందున్నారని తెలిపారు. ఇప్పుడు ఏఐ వచ్చిందన్నారు. నాడు సైబరాబాద్‌ను అభివృద్ధి చేశామని... నేడు తెలంగాణకు ప్రధాన ఆదాయవనరుగా మారిందని చెప్పారు. రాష్ట్ర విభజనతో మరో నగరాన్ని నిర్మించే అవకాశం వచ్చిందని... అమరావతిని గ్రీన్ ఫీల్డ్ సిటీగా నిర్మిస్తున్నామని వెల్లడించారు. కృష్ణానది, ఇన్నర్ - ఔటర్ రింగ్ రోడ్లు, ఐకానిక్ బ్రిడ్జిలతో అద్భుతంగా అమరావతి రూపుదిద్దుకుంటోందని వివరించారు. స్పోర్ట్స్, ఫైనాన్సియల్, నాలెడ్జ్, జస్టిస్, టూరిజం, హెల్త్, మీడియా వంటి కాన్సెప్ట్స్ తీసుకున్నామన్నారు. ఒకే ఒక్క పిలుపుతో రాజధాని కోసం రైతులు 35 వేల ఎకరాలను అప్పగించారని... వాటిలో కొంత భాగాన్ని అభివృద్ధి చేసి రైతులకు తిరిగి ప్లాట్లు ఇస్తున్నామన్నారు. 21 కి.మీ పొడవునా వాటర్ ఫ్రంట్ నగరంగా అమరావతి ఉంటుందని తెలిపారు. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్, అండర్ గ్రౌండ్ యుటిలిటీస్, గ్రీన్ ఎనర్జీ, నెట్ జీరో లక్ష్యంగా రాజధాని నిర్మాణం జరుగుతోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. సైబరాబాద్‌లో నాడు ఎకరం రూ.2 లక్షలు ఉంటే... నేడు రూ.200 కోట్లకు పెరిగిందన్నారు. అభివృద్ధి జరిగితే సంపద సృష్టి సాధ్యమవుతుందనేందుకు సైబరాబాద్ నిదర్శనమని తెలిపారు.

## బీసీలపై కక్షపూరిత చర్యలకు పాల్పడ్డ జగన్

ఐదేళ్ల పాలనంతా బడుగు బలహీన వర్గాలను వేధించడమేనని ఆగ్రహించారు. చేయాల్సిన అరాచకాలన్నీ చేసి ఇప్పుడు వైసీపీ నేతలు నీతులు చెబుతున్నారని విమర్శించారు. కుట్రలతో రాష్ట్రంలో అలజడులే అజెండాగా జగన్ రెడ్డి అడుగులేస్తున్నారని దుయ్యబట్టారు. అమర్నాథ్ గౌడ్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు మంత్రి కొల్లు రవీంద్ర.

## సువేందు అధికారిపై మమత న్యాయపోరాటం..

2021 ఎన్నికల్లో నందిగ్రామ్ నియోజకవర్గంలో సువేందు చేతిలో స్వల్ప తేడాతో ఓడిపోయినప్పుడు కూడా మమత హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్ ఇప్పటికీ కోర్టులో పెండింగ్‌లో ఉంది. తాజా పరిణామంతో మమత, సువేందు మధ్య రాజకీయ వైరం మరింత తీవ్రస్థాయికి చేరింది. ఈ పిటిషన్‌పై బీజేపీ గానీ, సువేందు అధికారి గానీ తక్షణమే స్పందించలేదు.

# కేసీఆర్ హయాంలో స్కీంలు.. కాంగ్రెస్‌లో స్కాములు

తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక కేసీఆర్ హయాంలో స్కీంలు చేపడితే కాంగ్రెస్ పాలనలో రేవంత్ సర్కారు స్కాంలకు పాల్పడుతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. ఎగవేతల రేవంత్ అంటే తనపై తిమ్మాపూర్ స్టేషన్ లో కేసు పెట్టినారని, ఇటీవల నోటీసులు ఇచ్చారని, ఆయన ఎగవేతల రేవంత్ అని మరోసారి అన్నారు. రైతు బంధు రూ.19వేల కోట్లు ఎగబెట్టారని అన్నారు. కేసీఆర్ హయాంలో కరోనా లాంటి క్లిష్ట పరిస్థితుల్లో సైతం ఏనాడు ఆపలేదని గుర్తు చేశారు. కరీంనగర్ జిల్లా అల్గునూర్ లో మానకొండూర్ నియోజకవర్గ స్థాయి డిజిటల్ సభ్యత్వ నమోదు తో పాటు సర్ పై విస్తృత స్థాయి సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన హరీష్ రావుకు అల్గునూర్ లో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ మేనిఫెస్టోలో చెప్పని కేసీఆర్ ప్రభుత్వంలో రైతు బంధు, రైతు భీమా, కళ్యాణ లక్ష్మీ లాంటి స్కీంలను కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తే సివిల్ సప్లైలో, సింగరేణిలో, హామ్ రోడ్లలో, పిల్లలకు అన్నం పెట్టే గుడ్లలో, బట్టలలో స్కాంలు రేవంత్ సర్కారు జరుగుతున్నాయని ఆరోపించారు. ఉపాధి కూలీలకు రూ.12వేలు ఇవ్వడం లేదని, మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న రేవంత్ కుటుంబం కోటీశ్వరులు అవుతున్నారని విమర్శించారు. జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ సంక్షేమ మంత్రులకు తెలియకుండా స్కాంలు జరుగుతున్నాయని, జిల్లా పరువు పోతుందని, రూ.2వేల కోట్ల స్కాం జరిగినా వారికి తెలియలేదని, ఇందులో ఎనుముల వారిదే రాజ్యం నడుస్తోందన్నారు. పతకాల అమలుకు ఖజానా లేదంటున్న రేవంత్ ఫుట్ బాల్ ఆటకి, అందాల పోటీలకు, వాస్తు పేరుతో సచివాలయ పనులకు, పలుచోట్ల క్యాంపు ఆఫీసులకు వందల కోట్లు ఖర్చు చేస్తున్నాడని, ఆయనకు రైతులు, మహిళల పట్ల, పేదల పట్ల మనస్సు లేదని విమర్శించారు. మన సొమ్మును ఇతర రాష్ట్రాల్లో ప్రకటనలకు, ఎన్నికలకు, ఢిల్లీకి పంపిస్తున్నాడని ఆరోపించారు. కమిషన్లు రావని పేదల పథకాలు అమలు చేయడం లేదని, కమిషన్లు వచ్చే పనులను రేవంత్ చేపడుతున్నాడని విమర్శించారు. ఓట్లు పెట్టి దేవుణ్ణి మోసం చేసిన ఎగువేతల రేవంత్ రెడ్డి విద్యార్థులను, నిరుద్యోగులను, రైతులను. మోసం చేస్తున్నాడని అన్నారు. రైతు భీమా ప్రీమియం గడువు పూర్తయి నాలుగు నెలలు అయిందని, రైతులు చనిపోతే ఆ కుటుంభాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. డిస్కం పేరుతో రైతులకు విద్యుత్తు కోతను తీసుకురానున్నారని ఆరోపించారు. రిజర్వాయర్లు, మెయిన్ కెనాల్స్ పూర్తి చేసి వేల ఎకరాలకు నీరిచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వముదేనని, పిల్ల కాలువలు పూర్తి చేస్తే మరిన్ని ఎకరాలకు నీరు అందించవచ్చన్నారు. అడుగడుగునా రైతులను వేధిస్తున్న కాంగ్రెస్ కి ఎవరైనా ఓటు వేస్తారా అంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టి వేధిస్తున్న కాంగ్రెస్ ఓటమి అంచున ఉందన్నారు. వడ్లుకొనే తెలివిలేని రేవంత్ బీఆర్ఎస్ ని మొలకెత్తనివ్వనని అంటున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ పరిస్థితి ఆయనకు అర్థమైందని, ఆయన పని అయిపోయినందునే అధికారులు ఆయన మాట వినడం లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణ బాగుండాలంటే బీఆర్ఎస్ మళ్లీ గెలిచి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని ఆయన అన్నారు. తెలంగాణ ఉద్యమంలో మానకొండూర్ నియోజకవర్గ ప్రజలు మనస్ఫూర్తిగా ఉద్యమం చేసినారని, 2001లో అన్నీ జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను గెలుపొందిన నియోజకవర్గములో కరుడుగట్టిన కార్యకర్తలున్నారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో 24 గంటల నాణ్యమైన కరెంటు ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వంలో పదకొండు గంటలకు తగ్గిందని, రైతు డిస్కంను ప్రవేశపెట్టి ఆరు ఏడు గంటలకే కుదించనున్నారని తెలిపారు. రైతు డిస్కం పేరిట సోలార్, విండ్ పవర్ ఇచ్చేలా చూస్తున్నారని, రాత్రి పూట కరెంటు ఎలా వస్తుందని ఆయన ప్రశ్నించారు. రైతుల ఉసురు తీసేందుకు రైతు డిస్కంలను తీసుకురానున్నారని ఆరోపించారు. ఇలాంటి రేవంత్ కి రైతులు ఎవరైనా ఓటు వేస్తారా అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ రైతులు సైతం కేసీఆర్ ని గుర్తు చేస్తున్నారని, రేవంత్ కి ఓటు వేసేందుకు సిద్ధంగా లేరని అన్నారు. రీఎంబర్స్ మెంట్ ని నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలల్లో సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని హరీష్ రావు ఆరోపించారు. బలహీన వర్గాల పిల్లలంటే రేవంత్ కి ఇష్టం లేదన్నారు. ఇప్పటి వరకు సీఎం, మంత్రులు రీ ఎంబర్స్ మెంట్ విషయం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉన్నత విద్యకు 30లక్షల మంది విద్యార్థులు దూరమై ఒక తరం వెనుకబడే ప్రమాదం ఉందన్నారు. కాంట్రాక్టర్లకు డబ్బులు ఇస్తున్న రేవంత్ సర్కారు పేద విద్యార్థులకు ఇవ్వడానికి మనస్సు రావడం లేదని విమర్శించారు. రెండు లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పిన రేవంత్ కేవలం 16వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిందని, నిరుద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు.

తెలంగాణ ఏర్పడ్డాక రాష్ట్రాన్ని సస్యశ్యామం చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని, 23 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించినట్లు తెలిపారు. ప్రాజెక్టులు, ప్రధాన కాలువలు పూర్తి చేసినట్లు, పిల్ల కాలువలు అక్కడక్కడా పూర్తి చేస్తే మరిన్ని ఎకరాలకు నీరు అందించవచ్చన్నారు. ప్రతీ 20 ఏళ్లకోసారి ఓటరు జాబితా సవరణ (సర్) ని ఎన్నికల కమిషన్ చేపడుతుందని, దీనిపై బీఆర్ఎస్ కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. విచారణ సమయంలో అధికారుల వెంట బీఆర్ఎస్ బూత్ ఇంచార్జీలు ఉండాలని సూచించారు. రివిజన్ సమయంలో ఇతర పార్టీల వారి పేర్లను తొలగించే ప్రమాదం ఉందని, జాగ్రత్తగా గమనించాలని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణా రావు, ఇంచార్జీ రవీంధర్ రావు, కార్పొరేటర్ కాల్వ మల్లేశం, నాయకులు రవీందర్ సింగ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, చల్ల హరిశంకర్, కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, రావుల రమేష్, సిద్దం వేణు, శేఖర్ గౌడ్, స్వామిరెడ్డి, ఏకానందం, నాయిని వెంకట రెడ్డి, రవీంధర్ రెడ్డి, వెంకన్న, మహిపాల్, రెడ్డి, పొన్నం అనిల్ గౌడ్, గడ్డం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## 'దిశ' ఫెయిల్.. 'శక్తి' సక్సెస్:

ఏ రాష్ట్రానికైనా పెట్టుబడులు, పరిశ్రమలు రావాలంటే అక్కడ శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉండాలని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఈరోజు నిర్వహించిన మీడియాసమావేశంలో కూటమి ప్రభుత్వ పోలీసింగ్ తీరుపై ఆమె పూర్తి స్థాయి రిపోర్ట్ కార్డ్‌ను బయటపెట్టారు. గత ప్రభుత్వ హయాంలో 'దిశ' చట్టం అమలు కాలేదని విమర్శిస్తూ.. తమ హయాంలో క్రైం రేట్ గణనీయంగా తగ్గిందని లెక్కలతో సహా వివరించారు. ఏపీలో క్రైం రేటు 14.1 శాతం తగ్గిందని హోంమంత్రి వెల్లడించారు. సీసీటీవీలు, డ్రోన్ టెక్నాలజీ వాడకం వల్లే ఇది సాధ్యమైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష సీసీ కెమెరాల టార్గెట్ పెట్టుకోగా, ఇప్పటికే 70 శాతం పూర్తి చేశామని, నేరం జరిగిన 24 గంటల్లోనే నిందితులను పట్టుకుంటున్నామని చెప్పారు.మహిళలపై నేరాల్లో 6.9 శాతం తగ్గుదల నమోదైందని తెలిపారు. తాము ఐజీ స్థాయి అధికారితో 'శక్తి యాప్' తెచ్చామని, దీనిని 1.5 కోట్ల మంది డౌన్లోడ్ చేసుకున్నారని తెలిపారు. లైంగిక నేరాల దర్యాప్తు నాణ్యత 31 శాతం నుంచి ఏకంగా 90 శాతానికి పెరిగిందని, 591 మందికి శిక్షలు పడ్డాయని వివరించారు. 'ఈగల్ టీమ్' ద్వారా నార్కోటిక్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామని, ఏపీ మోడల్‌ను తెలంగాణ కూడా అనుసరిస్తుండడం మనకు గర్వకారణమన్నారు. ఇప్పటివరకు 2,366 గంజాయి కేసులు నమోదు చేసి, 986 మందిని అరెస్ట్ చేశామన్నారు. అలాగే సైబర్ క్రైమ్స్ కోసం ప్రత్యేక 'వార్ రూమ్' ఏర్పాటు చేస్తున్నామని, రూ. 247 కోట్ల సైబర్ ఫ్రాడ్ మనీని ఫ్రీజ్ చేయడంతో పాటు 8 వేలకు పైగా ఇల్లీగల్ ఆన్‌లైన్ కంటెంట్‌ను తొలగించామని స్పష్టం చేశారు.

## రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు మెడికల్ రిపోర్టులను సమర్పించాలని హైకోర్టు ఆదేశం

వైసీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎంపీ, ప్రస్తుత ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ఉండి తెలుగుదేశం ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణంరాజు సంబంధించిన కస్టోడియల్ టార్చర్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో మంగళవారం ఈకేసుపై విచారణ జరిగింది. ఈ కేసుకు సంబంధించిన అన్ని మెడికల్ రిపోర్టులను తమ ముందుంచాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించిన మెడికల్ బోర్డు నివేదికలు, వైద్య పరీక్షల పూర్తి రికార్డులు, ఇతర సంబంధిత పత్రాలను కోర్టుకు సమర్పించాలని స్పష్టం చేసింది. సీఐడీ అధికారులు తనను కస్టడీలో చిత్రహింసలకు గురిచేశారని రఘురామ గతంలో ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై న్యాయస్థానం ఆదేశాల మేరకు మెడికల్ బోర్డు, వివిధ విభాగాధిపతులు నిర్వహించిన వైద్య పరీక్షల నివేదికలను తారుమారు చేయడానికి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రయత్నిస్తున్నారని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాగే, తప్పుడు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మెడికల్ బోర్డును రక్షించేందుకు ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రయత్నిస్తున్నారని కూడా పిటిషన్‌లో రఘురామ ఆరోపించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో గతంలోనే సంబంధిత మెడికల్ రిపోర్టులను భద్రపరచాలని వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య

కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం ఆ రికార్డులన్నింటినీ న్యాయస్థానం ముందుంచాలని మరోసారి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు విచారణను హైకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది. అప్పటిలోగా అన్ని వైద్య రికార్డులు, మెడికల్ బోర్డు నివేదికలు, సంబంధిత పత్రాలను సమర్పించాలని అధికారులను ఆదేశించింది. ఈ కేసులో మెడికల్ ఆధారాలు కీలకంగా మారనున్న నేపథ్యంలో ఏపీ హైకోర్టు తాజా ఆదేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# శ్రీనివాస నగర్ ప్రధాన రహదారి వైట్‌టాప్ నిర్మాణంలో

# ప్రభుత్వ శాఖల సమన్వయ లోపం

## ప్రమాదంలో మరణించిన ఇమాంసా కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

## ప్రజా సమస్యలపై పౌర సమాజం స్పందించాలి.

## బొజ్జా దశరథరామిరెడ్డి



**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 16 ( నంది పత్రిక )** శ్రీనివాస నగర్ ప్రధాన రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కార్పెంటర్‌గా జీవనోపాధి పొందుతూ తన పేద కుటుంబానికి ఆధారంగా ఉన్న ఇమాంసా మృతి చెందడం అత్యంత బాధాకరమైన సంఘటన అని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**మంగళవారం నంద్యాల సమితి కార్యాలయం నందు దశరథరామిరెడ్డి మాట్లాడుతూ..** శ్రీనివాస నగర్ ప్రధాన రహదారిలో తారు రహదారి స్థానంలో వైట్‌టాప్ (సిమెంట్) రహదారి నిర్మాణ పనులు చేపట్టిన నేపథ్యంలో వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం, నిర్మాణ ప్రాంతంలో తగిన భద్రతా చర్యలు లేకపోవడం, అలాగే వాహన డ్రైవర్ నిర్లక్ష్యం కలిసి ఈ ప్రమాదానికి కారణమైనట్లు స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. నంద్యాల పట్టణంలోని అత్యంత కీలకమైన ప్రధాన రహదారులలో ఒకటైన ఈ రోడ్డులో గత మూడున్నర నెలలుగా నిర్మాణ పనులు కొనసాగుతున్నప్పటికీ, కనీసం ఒక వైపు రహదారిని కూడా ప్రజల రాకపోకలకు అందుబాటులో ఉంచలేకపోవడం విచారకరమన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటు, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, పాదచారుల భద్రత వంటి అంశాల్లో సంబంధిత శాఖలు తగిన చర్యలు తీసుకోలేదన్నారు. ఆర్ & బి శాఖ, మున్సిపాలిటీ, ట్రాఫిక్ పోలీసులు మరియు ఇతర సంబంధిత విభాగాల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ రహదారి పరిసర ప్రాంతాల్లో అనేక ఆసుపత్రులు, మెడికల్ షాపులు ఉండటంతో ప్రతిరోజూ రోగులు, వృద్ధులు, మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నారని, నిర్మాణ పనులను క్రమబద్ధంగా మరియు వేగవంతంగా పూర్తి చేయడంలో విఫలమవడం వల్ల ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. పరిస్థితి తీవ్రతను గమనించినప్పటికీ సంబంధిత శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రజా సమస్యలపై అప్రమత్తంగా స్పందించాల్సిన రాజకీయ పార్టీలు కూడా పరస్పర విమర్శలకే పరిమితమై, ప్రజా భద్రత వంటి కీలక అంశాలపై సమిష్టి బాధ్యతతో వ్యవహరించలేకపోతున్నాయని ఆయన విమర్శించారు. ఇలాంటి సందర్భాల్లో పౌర సమాజం, ప్రజాస్వామ్యవాదులు, సామాజిక చైతన్యవంతులు కలిసి ప్రజా ప్రయోజనాల కోసం పనిచేసే వేదికలను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. నంద్యాల పట్టణ ప్రముఖులు ఈ దిశగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇమాంసా మరణానికి దారితీసిన పరిస్థితుల్లో ప్రభుత్వ శాఖల నిర్లక్ష్యం కూడా ఒక కారణమని భావిస్తున్నందున, ఆయన కుటుంబానికి ప్రభుత్వం కనీసం రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై ఉన్నతస్థాయి విచారణ జరిపి భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. “అభివృద్ధి పనులు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారకూడదు. ప్రజల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయడం ప్రభుత్వ శాఖల బాధ్యత. మృతుడి కుటుంబ సభ్యులకు మరోసారి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను“ అని బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు.

# హోంమంత్రి అనితపై అనుచిత వ్యాఖ్యలు

## గుడివాడ అమర్నాథ్ చిత్రపటానికి కోడిగుడ్లతో కొట్టి 'తెలుగు మహిళల' వినూత్న నిరసన!





## అమర్నాథ్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలి

## తల్లిని, చెల్లిని దూషించి తరిమేసిన సంస్కృతి వైసీపీది

## మహిళలను గౌరవించే నారా లోకేష్ వెంటే మేమంతా..

## ఆగ్రహం వ్యక్తం చేసిన రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ

**నంది పత్రిక కర్నూలు బ్యూరో** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి శ్రీమతి వంగలపూడి అనితపై వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై తెలుగు మహిళలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం కర్నూలు పట్టణం, కల్లూరు మండలం 41వ వార్డు వీకర్ సెక్షన్ కాలనీలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ముందు తెలుగు మహిళలు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. హోంమంత్రిపై అడ్డగోలుగా మాట్లాడిన గుడివాడ అమర్నాథ్ చిత్రపటాలపై కోడిగుడ్లు విసురుతూ, చెప్పులతో కొడుతూ వినూత్న రీతిలో తమ నిరసనను, తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అమర్నాథ్‌పై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలతో హోరెత్తించారు.

**మహిళలను అగౌరవపరచడమే వైసీపీ నైజం!** ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ మాట్లాడుతూ.. వైసీపీ నాయకులకు మహిళల పట్ల కనీస గౌరవం లేదని మండిపడ్డారు. ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పి గద్దె దించినా వారి వైఖరిలో మార్పు రాలేదని ధ్వజమెత్తారు. “సొంత తల్లిని, చెల్లిని సైతం దూషించి, నడిరోడ్డుపై నిలబెట్టి, పార్టీ నుంచి బహిష్కరించిన చరిత్ర మీ నాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డిది. అలాంటి పార్టీ నాయకుల నుంచి మహిళా గౌరవాన్ని ఆశించలేం. అందుకే నేడు ఆంధ్రప్రదేశ్‌లోని మహిళలందరూ వైసీపీని శాశ్వతంగా బహిష్కరించి, కూటమి ప్రభుత్వానికి బ్రహ్మరథం పడుతున్నారు“ అని ఆమె ఘాటుగా విమర్శించారు.

**'యత్ర నార్యస్తు పూజ్యంతే'.. మా లోకేష్ బాబును చూసి నేర్చుకోండి!** “యత్ర నార్యస్తు పూజ్యంతే– రమంతే తత్ర దేవతాః“ (ఎక్కడ స్త్రీలు పూజించబడతారో అక్కడ దేవతలు నివసిస్తారు) అనే నానుడిని పాటిస్తూ.. ప్రతి మహిళను ఒక తల్లిగా, సొంత చెల్లెలిగా గౌరవిస్తున్న ఏకైక యువ నాయకుడు నారా లోకేష్ బాబు అని మహిళా నేతలు కొనియాడారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని వరమిచ్చిన మహానాయకుడు లోకేష్ బాబును చూసైనా వైసీపీ నేతలు బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. మాటల్లో వర్ణించలేని విధంగా బూతులు తిడుతూ, సంస్కారహీనంగా వ్యవహరిస్తున్న గుడివాడ అమర్నాథ్ తక్షణమే రాష్ట్ర మహిళా లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఆయనకు తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

**భారీగా పాల్గొన్న నేతలు, కార్యకర్తలు**

ఈ వినూత్న నిరసన కార్యక్రమంలో తెలుగు మహిళలు రాధిక, సునీత, వరలక్ష్మి, బీబీ, పద్మావతి, కళావతి, మద్దమ్మ, సుబ్బమ్మ, కృష్ణవేనమ్మ, ఉసేనమ్మతో పాటు 37వ వార్డు ఇన్‌ఛార్జ్ సుతారు రాఘవేంద్ర, టీడీపీ నాయకులు భూపాల్, సుబ్బరాయుడు, వెంకటేష్, బాలకృష్ణ, అనిల్, విజయ్, బసన్న, రామాంజనేయులు మరియు పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, మహిళలు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.



# శ్రీ మద్దులేటి స్వామి దేవస్థాన హుండీ లెక్కింపు.

**బేతంచెర్ల జూన్ 16 ( నందిపత్రిక ).** నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో ఉన్న ప్రముఖ వైష్ణవ క్షేత్రం లక్షలాది భక్తుల ఆరాధ్య దైవమగు శ్రీ మద్దులేటి లక్ష్మీ నర సింహ స్వామి మరియు శ్రీ మహాలక్ష్మి దేవీ మాతను, సూదుర ప్రాంతాల నుండి, వేలాది మంది భక్తులు తరలి వచ్చి స్వామి,అమ్మవార్లను దర్శించుకొని, వారివారి మొక్కులు చెల్లించుకొని,శ్రీ మద్దులేటి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో గల హుండీలో ముడుపులు, కానుకలు సమర్పించు కుంటారు. భక్తులు సమర్పించిన దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం జూన్ నెల 17 వతేది అనగా బుధవారం ( నేడే ) నాడు నిర్వహించడం జరుగునని ఉపకమిషనర్ & దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఎం.రామాంజనేయులు మంగళవారం నాడు తెలియ జేస్తూ, 14/5/2026 నుండి 16/6/2026 వరకు అంటే, 34 రోజులలో భక్తులు హుండీలో వేసిన కానుకలు, ముడుపులును లెక్కిస్తారని తెలిపారు. ఉపకమిషనర్ & దేవస్థానం ఈఓ ఎం. రామాంజనేయులు ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ అధికారి రమేష్ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్టనున్నారని తెలిపారు.



# పది లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతుల పంపిణీ.



**మర్రిపాడు జూన్ 16నంది పత్రిక :** చుంచులూరు ఉన్నత పాఠశాల నందు పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి 500 పైగా మార్కులు సాధించిన నాగరాజు పల్లి విక్రాంత్,కలువాయి సునీత,వల్లెపు నరేష్ లకు పాఠశాల పూర్వ విద్యార్థి,విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి పాపుదిప్పు రమణారెడ్డి ఒక్కొక్కరికి ఇరవై వేలు వంతున మొత్తం అరవై వేల రూపాయలు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ మాట్లాడుతూ ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో 500 పైన మార్కులు సాధించిన ప్రతి విద్యార్థికి 20000 రూపాయల వంతున నగదు ప్రోత్సహకాలు అందజేయడం అభినందనీయమని, విద్యార్థులలోని ప్రతిభను వెలికితీసి వారిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు ఇలాంటి ప్రోత్సాహకాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థిగా రమణారెడ్డి పాఠశాల పట్ల చూపుతున్న అభిమానం,విద్యార్థుల భవిష్యత్తు పట్ల తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ అభినందనీయమని కొనియాడారు. దాత రమణారెడ్డి మాట్లాడుతూ విద్య జీవితానికి బలమైన పునాది అని,విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని,క్రమశిక్షణతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. భవిష్యత్తులో కూడా 500 పైన మార్కులు వచ్చిన విద్యార్థులందరికీ ఒక్కొక్కరికీ ఇరవై వేలు వంతున ప్రోత్సాక నగదు బహుమతి అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గంగపాలెం ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్,రాజుపాలెం ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి,ఉపాధ్యాయులుడి. వి. రమణయ్య,పెంచలరావు,బాలాజీ,మల్లికార్జున స్వామి,తిరుపాలు,రహీమ,ప్రసాద్,రాఘవేంద్ర,కలిశెట్టి రాజేంద్ర కుమార్,యలగాల శ్రీనివాసులు, గ్రామానికి చెందిన నాగరాజుపల్లి రాజా,కాకే సుబ్బారెడ్డి,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# రెండేళ్ల ప్రజా పాలన పై డోన్ కు తరలి వెళ్లిన బేతంచెర్ల టిడిపి శ్రేణులు.



**బేతంచెర్ల జూన్ 16 ( నందిపత్రిక ).** తెలుగు దేశం కూటమి ప్రభుత్వం రెండేండ్ల ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రజా పరిపాలన విజయ వంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా డోన్ నియోజక వర్గం శాసన సభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో డోన్ లో నిర్వహించు చున్న విజయోత్సవ సభలో పాల్గొనుటకై మంగళవారం ఉదయంన,టిడిపి బేతంచెర్ల మండల, పట్టణ నాయకులు కార్యకర్తలు కలిసి వాహనాలతో డోన్ కు బయలు దేరి వెళ్లారు.

# నగర పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత.

## కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి.



**తిరుపతి బ్యూరో చీఫ్ జూన్ 16 నంది పత్రిక** మన ఇంటితోపాటు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి అన్నారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా మంగళవారం నగరంలోని ఉపాధ్యాయ నగర్, రాయల్ నగర్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా నగరంలోని అన్ని వార్డుల్లో పారిశుద్య పనులు చేపడుతున్నామని తెలిపారు. ఉపాధ్యాయ నగర్ సమీపంలోనికి ఇటీవల చిరుత పులి వచ్చిందని తెలిపారని అన్నారు. ఆహార వ్యర్థాలు రోడ్లపక్కన పడేయడం వలన కుక్కలు, వన్యప్రాణులు వస్తున్నాయని తెలిపారు. వీటి కొరకు చిరుతలు వస్తున్నాయని తెలిపారు. కావున వ్యర్థాలను రోడ్లపక్కన, కాలువల్లో వేయవద్దని తెలిపారు. రాయల్ నగర్లో ప్రజలు పలు సమస్యలను వివరించారని వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. రాయల్ నగర్ నందు పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి. ఈ. మహేష్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, స్వర్ణ వార్డు కార్యదర్సులు, పారిశుద్య సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.



# అమర్నాథ్ గౌడ్ త్యాగం మరువలేనిది: ఎన్ఎండీ ఫిరోజ్







**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 16 ( నంది పత్రిక )** బాపట్ల జిల్లా ఉప్పలవారిపాలేనికి చెందిన 13 ఏళ్ల బాలుడు, ఉప్పాల అమర్నాథ్ గౌడ్ దారుణ హత్యకు గురై నేటితో మూడేళ్లు పూర్తయిన సందర్భంగా, నంద్యాల తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ ఆధ్వర్యంలో నంద్యాల పార్టీ కార్యాలయం నుంచి పద్మావతి నగర్ ఆర్చి వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ఏర్పాటుచేసిన అమర్నాథ్ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ... తన సోదరిని వేధించిన వైసీపీ నాయకులను ధైర్యంగా ఎదిరించి, ప్రాణాలర్పించిన అమర్నాథ్ గౌడ్ త్యాగం స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలపై ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉన్నారని, అప్పట్లో జరిగిన ప్రజా తీర్పు ద్వారా వైసీపీకి 11 సీట్లు ఇచ్చి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు . ప్రస్తుత కూటమి ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి సాదిస్తోందని, ప్రజల మద్దతు ఎప్పుడూ అభివృద్ధి చేసే కూటమి ప్రభుత్వానికే ఉంటుందని తెలిపారు . అమర్నాథ్ గౌడ్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, బాలుడి త్యాగాన్ని ఎప్పటికీ మరువబోమని అన్నారు . ఈ నిరసన కార్యక్రమంలో జిల్లెల్ల శ్రీరాములు, రమణయ్య గౌడ్, గోవిందు నాయుడు, ఉప్పర సురేష్ కుమార్, రామచంద్రుడు, బుగ్గ రాముడు , మరాఠీ సూరి, పద్మ, నాగరత్నమ్మ, మధు సాయి, మంజుల సుబ్బరాయుడు, వడ్డే జనార్ధన్, మారుతి కుమార్ మరియు తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# విద్యా హక్కు చట్టం - విద్యార్థులకు వరం : టిడిపి



**శిరివెళ్ల (నంది పత్రిక) :** తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా హక్కు చట్టం విద్యార్థులకు వరం లాంటిదని శిరివెళ్ల మండలం యర్రగుంట్ల గ్రామంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. మండల పరిధిలోని యర్రగుంట్ల మేజర్ గ్రామపంచాయతీలో గల జిల్లా పరిషత్ హై స్కూల్ లో ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ అధ్యక్షతన ఎంపీటీసీ కమతం జయరామిరెడ్డి, నీటి సంఘం చైర్మన్ కమతం లక్ష్మిరెడ్డి టిడిపి బీసీ సెల్ నేత శీలం లక్ష్మి ప్రసాద్ ఇతర టిడిపి నేతలు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమతం జయరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్కార్ బడులలో చదివే విద్యార్థులకు తల్లికి వందనం ఓ సంచలనాత్మకమైన పథకమని పేదరికం వల్ల పేద విద్యార్థుల చదువు మధ్యలో ఆగరాదని భావించి విద్యా అభ్యాసానికి ఆర్థిక పరిస్థితి అడ్డు రాకూడదని ఈ పథకం ప్రవేశపెట్టినట్లు తెలియజేశారు. పాఠ్యపుస్తకాలు బ్యాగులు యూనిఫామ్ బూట్లు ఉచితంగా అందజేస్తుందని అన్నారు. సమాజంలోని ప్రతి విద్యార్థిని విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని కమతం లక్ష్మిరెడ్డి తెలియజేశారు. ఈ విద్యాసంస్థరం నుండి ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబోధన అందించాలని 100% ఉత్తీర్ణత సాధించేందుకు కృషి పట్టుదలతో ముందుకు సాగాలని శీలం లక్ష్మి ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శ్రీరాములు, సత్తార్ రామిరెడ్డి, రాము తదితర టిడిపి నేతలు ఉపాధ్యాయుడు పాల్గొన్నారు.

# బండి ఆత్మకూరులో వివాదాస్పదంగా డ్రైనేజీ నిర్మాణం



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 16:** బండి ఆత్మకూరు లోని ఆరవ వార్డులో నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణం వివాదాస్పదంగా మారింది. 10 సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో 100 మీటర్లకు పైగా సిమెంట్ రోడ్డును నిర్మించడం జరిగింది. అప్పుడు నిర్మించిన సిమెంట్ రోడ్డుకు డ్రైనేజీ లేకపోవడంతో సిమెంట్ రోడ్లకు సంబంధించిన మిగులు నిధులతో డ్రైనేజీ నిర్మించాలని అధికారులు నిర్ణయించుకున్నారు. గత మూడు రోజుల నుండి ఈ ప్రాంతంలో డ్రైనేజీ ఏర్పాటుకు గాను రోడ్డు కిరుపక్కల గుంతలు తీశారు. అయితే గుంతలు తీసే విషయంలో ఈ ప్రాంతంలో ప్రజల మధ్య మనస్పర్ధలు ఏర్పడి ఘర్షణకు దారి తీసే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయంపై కొందరు వ్యక్తులు మంగళవారం పోలీసులను ఆశ్రయించారు. ఇరువురు పోలీసులు ఈ ప్రాంతానికి చేరుకొని ప్రజలను సర్ది చెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వారి వినకపోగా వారితో కూడా వాగ్వివాదానికి దిగడంతో పోలీసులు అక్కడి నుండి వెనుతిరిగారు. ఈ సంఘటన తాసిల్దార్, గ్రామ స్పెషల్ ఆఫీసర్ అయిన పద్మావతమ్మ దృష్టికి రావడంతో, వెంటనే పంచాయతీ కార్యదర్శి అక్బర్ తో కలిసి ఈ ప్రాంతానికి చేరుకున్నారు. తాసిల్దార్ వద్ద కూడా ప్రజలు మాట మాట పెంచుకోవడంతో, అసహనానికి గురయ్యారు. కార్యదర్శి చెప్పిన మేరకే తాము గుంతలు తీసేందుకు ఒప్పుకున్నామని, తీరా గుంతలు తీశాక, ఈ విషయంపై నోరుమెదకపోవడం పట్ల కొందరు ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా ఇరు ప్రక్కల కొలతలు వేయకుండా డ్రైనేజీ పనులు ఎలా మొదలు పెట్టారని స్పెషల్ ఆఫీసర్ ప్రశ్నిస్తూ, ఈ విషయంపై చర్చించి చర్యలు తీసుకుంటామని స్పెషల్ ఆఫీసర్ పద్మావతమ్మ ఆ ప్రాంత ప్రజలకు తెలియజేశారు.

## కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన - నంద్యాల టెక్క మార్కెట్ యార్డ్‌లో భారీ బహిరంగ సభ : ఎన్ఎండి ఫిరోజ్



**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 16 ( నంది పత్రిక )**రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, నంద్యాల జిల్లాలో ఘనంగా సంబరాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా రేపు, జూన్ 17న నంద్యాల టెక్క మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలుగుదేశం పార్టీ (టిడిపి) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని ఆయన పార్టీ శ్రేణులను, ప్రజలను కోరారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ భారీ బహిరంగ సభకు జరుగుతున్న ఏర్పాట్లను ఎన్ఎండి ఫిరోజ్ స్వయంగా పర్యవేక్షించారు. టెక్క మార్కెట్ యార్డ్ వేదిక వద్ద జరుగుతున్న పనులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, సభకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, జిల్లెల్ల శ్రీరాములు, దీపక్ రెడ్డి, కృపాకర్, మున్నా, గోవింద నాయుడు, బుగ్గ రాముడు, సురేష్ కుమార్, మరాఠి సూరి, సుధాకర్ మరియు పార్టీ కార్యకర్తలు, నాయకులు, కూటమి అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



# కోటపాడు సచివాలయంలో ఆకస్మిక తనిఖీ డి.ఎల్. డి.వో శివారెడ్డి

### సచివాలయ సిబ్బందికి స్ట్రాంగ్ వార్నింగ్



**సిరివెళ్ల (నంది పత్రిక)**సిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామ సచివాలయాన్ని డి.ఎల్.డి.వో అధికారి శివారెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో సమావేశమై కార్యాలయంలో జరుగుతున్న వివిధ సేవలు ప్రజల విన్నపాలపట్ల సచివాలయ సిబ్బందికి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. కొందరు సిబ్బంది కంప్యూటర్లో అప్లికేషన్ కోసం చేతివాటం ప్రదర్శిస్తూ జీతం కాకుండా అదనంగా సంపాదిస్తున్నారని విమర్శలు అధికంగా వినిపిస్తున్న నేపథ్యంలో ఆయన తనిఖీ చేసినట్లు తెలియజేశారు. అనంతరం అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.సచివాలయ రికార్డులను పరిశీలించిన ఆయన, ప్రభుత్వ సేవలను ప్రజలకు సమర్థవంతంగా అందించాలని సిబ్బందికి సూచించారు. విధుల నిర్వహణలో అవినీతికి బంధు ప్రీతికి ప్రలోభాలకు లోను లోను కాకుండా సచివాలయ సిబ్బంది గోల్మాల్ విధంగా ప్రవర్తించకుండా నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సిరివెళ్ల ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప, డిప్యూటీ ఎంపీడీవో అశ్వినీకుమార్ సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

# టి యు సి ఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా టి తిరుపాలు ఎన్నిక



**నంద్యాల ప్రతినిధి. జూన్ 16 . (నంది పత్రిక ):**ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శిగా టీ తిరుపాలు ఎన్నికైనట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వాలు కార్మిక రంగానికి తీవ్రమైన అన్యాయం చేశారన్నారుకార్మిక వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వంఉపసంహరించుకోవాల ని టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి టి తిరుపాలు అన్నారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల దేశంలోని కార్మిక వర్గం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి టి తిరుపాలు విమర్శించారు. కార్మికులకు గతంలో ఉన్న అనేక హక్కులను కేంద్ర ప్రభుత్వం క్రమంగా బలహీనపరిచిందని ఆయన పేర్కొన్నారు.కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం ద్వారా కార్మికుల ఉద్యోగ భద్రత, వేతనాలు, సామాజిక భద్రత, ట్రేడ్ యూనియన్ హక్కులపై ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం వల్ల ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయని, కాంట్రాక్ట్ విధానం పెరగడంతో కార్మికుల దోపిడీ అధికమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను పెంచాలని, అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని అన్నారు.

# 20, 21 తేదీల్లో జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు



**నంద్యాల (స్పోర్ట్స్):** నంద్యాల నంది పైప్స్ బ్యాడ్మింటన్ అకాడమీ నందు జూన్ 20, 21 తేదీల్లో ఉమ్మడి జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంశీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 20వ తేదీ (శనివారం) అండర్-11, అండర్-13 విభాగాల్లో బాలబాలికలకు, 21వ తేదీ (ఆదివారం) అండర్-15, అండర్-17 విభాగాల క్రీడాకారులకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.అన్ని విభాగాల్లో సింగిల్స్, డబుల్స్ ఈవెంట్లలో పోటీలు నిర్వహించి జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశం పొందుతారని వెల్లడించారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు తమ పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం మరియు ఆధార్ కార్డును తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. అలాగే తమ ఎంట్రీలను జూన్ 18వ తేదీలోగా నమోదు చేసుకోవాలని కోరారు.వివరాలకు కోచ్ నాగర్జున నెంబర్ 8985809434 ను సంప్రదించాలని కోరారు.

# శ్రీశైలం దేవస్థానంలో వైభవంగా స్వర్ణరథోత్సవం

**శ్రీశైలం జూన్ 16(నంది పత్రిక)** ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని (16.06.2026) శ్రీస్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించబడింది.కాగా ఆరుద్రోత్సవంలో భాగంగా ఈ రోజు వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి.

**అనంతరం స్వర్ణరథోత్సవం జరిపించబడింది.** ఈ స్వర్ణరథోత్సవంలో ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, అతివృష్టి అనావృష్టి నివారించబడాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు లోకకల్యాణానికాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తరువాత రథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి. అనంతరం భక్తుల శివనామస్మరణతో వేదమంత్రాల నడుమ ఉదయం గం.7.30లకు ఈ స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి అక్కడి నుండి నంది మండపం వరకు ఈ రథోత్సవాన్ని జరిపించడం జరిగింది. సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో పలు కళా బృందాల కోలాటం, తప్పెట చిందులు, మొదలైన జానపద కళారూపాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యురాలు శ్రీమతి జిల్లెల శ్రీదేవి, సహాయ కార్యనిర్వహణాధికారి జి. స్వాములు అర్చకస్వాములు, పలువిభాగాల అధికారులు, పర్యవేక్షకులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.



# డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వాలంటే సగం జీతం ఇవ్వాల్సిందే .

**జూన్ 16 ఉదయగిరి నంది పత్రిక :** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వింజమూరు మండలం చాకలికొండ పశు వైద్యాధికారి కొమ్మి కోటేశ్వరరావు క్రింది స్థాయి సిబ్బంది పై వేధింపుల్లో వెలుగులోకి మరో కథనం.. అతనో పేదవాడు రెక్కాడితే గాని పూటగడవని వైనం పైగా షెడ్యూలు కులానికి సంబంధించిన వ్యక్తి.. నందిగుంట గ్రామానికి చెందిన జయరాం గోపాలమిత్ర గా పనిచేస్తూ జీవనం సాగిస్తూ ఉన్నాడు.. ప్రభుత్వం ద్వారా గౌరవ వేతనం క్రింద ఆరు నెలలకు ఒకసారి జీతం అందుతూ ఉంటుంది . తను జీతం తీసుకోవాలంటే 3000 రూపాయలు ఇవ్వాల్సిదే అని లేదంటే డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వనని చెప్పగా విస్తుపోవడం తన వంతు అయింది.. ఆరు నెలల కోసారి వచ్చే జీతంలో సగ జీతం ఇవ్వలేను అని మొరపెట్టుకున్నా వినలేదు అని పలు మార్లు చాకలికొండ హాస్పిటల్ వద్దకు తిప్పుకుని వేదింపులకు గురి చేశాడు అని చివరికి నా ఆరోగ్యం సరిగా లేదు అని ప్రాధేయపడ్డ గాని కనికరించ లేదని చివరికి తిరిగే ఓపిక లేక కుటుంబం గడవడం కష్టంగా మారడంతో 1500 ఇచ్చి డ్యూటీ సర్టిఫికెట్ తీసుకున్నాను అనివిచారణ అధికారి ముందు వాపోయిన వైనం .. ఇలాంటి అధికారి పై చర్యలు తీసుకోకుండా ఇంకా వేచి చూసే ధోరణి పై ప్రజలు తీవ్రంగా మండి పడుతున్నారు .

# ఉపాధి కూలీలతో హౌసింగ్ గ్రామసభ






## హవ్వ! ఇదేమి విడ్డూరం!

**బండిఆత్మకూరు నంది పత్రిక జూన్ 17:** బండి ఆత్మకూరు సచివాలయంలో మంగళవారం హౌసింగ్ అధికారులు నిర్వహించిన గ్రామసభ అభాసు పాలయింది. గత రెండు సంవత్సరాల నుండి నూతన గృహాల మంజూరు కొరకు లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్న నేపథ్యంలో, గ్రామాలలో నాలుగు నెలల క్రితం హౌసింగ్ అధికారులు పక్కా గృహాల ఎంపిక కొరకు గ్రామాలలో సర్వే నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి కొద్దికాలం క్రితమే మంజూరు కొరకై ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపడం జరిగింది. వడపోత కార్యక్రమం అనంతరం బండి ఆత్మకూరు మండలానికి 1092 దరఖాస్తులలో 875 గృహాలు మంజూరు కాగా 217 గృహాలు వివిధ కారణాల కారణంగా తిరస్కరణకు గురయ్యాయి. మంజూరైన గృహాలకు సంబంధించి ఈ నెల 12వ తేదీ నుండి ఆయా గ్రామాలలో సభలు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా హౌసింగ్ అధికారులు నిర్వహించే గ్రామసభలు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. లబ్ధిదారుల ఎంపిక విషయంలో ప్రభుత్వం సూచించిన మార్గదర్శక సూత్రాలను హౌసింగ్ అధికారులు ఏమాత్రం పాటించడం లేదు. గ్రామాలలోని నలుగురు నాయకులను పోగుచేసి మొక్కుబడిగా గ్రామసభలు నిర్వహించినట్లు ఫోటోలు తీసుకుని చేతులు దులుపుకున్నారు. అయితే మంగళవారం బండి ఆత్మకూరు లో నిర్వహించిన గ్రామసభ విమర్శలకు దారి చేసింది. గ్రామ సభ నిర్వహించే ముందు గ్రామంలో దండోరా వేసి, లబ్ధిదారులను గ్రామసభకు హాజరుకావాలని హౌసింగ్ అధికారులు చెప్పాల్సి ఉంది. అయితే గ్రామంలో ఇందుకు సంబంధించి ఎలాంటి దండోరా వేయించలేదు. గృహాలు మంజూరైన లబ్ధిదారులకు ఎలాంటి సమాచారం అందజేయలేదు. కేవలం పత్రికలకు మాత్రం సమాచారం అందజేసి హౌసింగ్ అధికారులు మమ అనే రీతిలో వ్యవహరించారు. గ్రామసభను ఏదో రీతిలో నిర్వహించాలి కాబట్టి, అందుకు అనుగుణంగా సచివాలయ కార్యాలయాన్ని గ్రామసభకు వేదికగా చేసుకున్నారు. విచిత్రం ఏమిటంటే గ్రామ సభకు ఎంపికైన లబ్ధిదారులు ఎవరు హాజరు కాలేదు. ప్రతి గ్రామ సభకు టం చెనుగా హాజరయ్యే నలుగురు నాయకులు మాత్రం సమావేశానికి ముందే హాజరయ్యారు. నిర్ణీత సమయానికి గ్రామసభ నిర్వహించకపోవడంతో సమావేశానికి వచ్చిన కొద్దిపాటి మహిళలు ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. 11 గంటల తర్వాత ప్రారంభమైన గ్రామసభలో సచివాలయ సిబ్బంది మాత్రం సభలో కూర్చుండిపోయారు. ఆ తర్వాత ఉపాధి పనులు చేసే కూలీలు మాత్రం చక చకా గ్రామసభకు చేరుకొని కుర్చీలలో ఆసీనులయ్యారు. బండి ఆత్మకూరు గ్రామానికి 103 మందికి గృహాలు మంజూరు కాగా, అందులో కేవలం ఇద్దరు మహిళలు మాత్రమే హాజరు కావడం వింత కొలుపుతూ ఉంది. సమావేశానికి హాజరు అయిన ఉపాధి కూలీలను ప్రశ్నిస్తే, ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు తమను గ్రామ సభకు రమ్మని చెప్పడంతో ఇక్కడికి రావడం జరిగిందని పలువురు ఉపాధి కూలీలు పేర్కొనడం గమనార్హం. మంజూరైన గృహాలకు సంబంధించిన నివేదికను ఇంజనీరింగ్ అసిస్టెంట్ చదువుతూ ఉండగా, ఎవరు కూడా నోరు మెదపకపోవడం వింతగొ లుపుతూ ఉంది.ద గృహాల మంజూరు విషయంలో ఎంపికైన లబ్ధిదారులు హాజరు కాకపోవడంతో స్పెషల్ ఆఫీసర్ పద్మావతమ్మ హౌసింగ్ అధికారుల పనితీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు సమాచారం అందజేయడంలో ఎందుకు అలసత్వం ప్రదర్శించారని స్పెషల్ ఆఫీసర్ హౌసింగ్ అధికారులపై కాసింత మండిపడ్డారు. లబ్ధిదారులను సమావేశానికి రప్పించకుండా ఉపాధి కూలీలను రప్పించడంలో అధికారుల అంతర్యం ఏమిటో అంతుపట్టడం లేదు. తూతు మంత్రంగా గ్రామసభను నిర్వహించారని లబ్ధిదారులు హౌసింగ్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమను కాకుండా ఉపాధి కూలీలను గ్రామ సభకు రప్పించడం ఏమిటి? హవ్వ! ఇదెక్కడి విడ్డూరం! అంటూ లబ్ధిదారులు హౌసింగ్ అధికారుల పనితీరు పట్ల విమర్శలు గుప్పిస్తున్నారు. బహిరంగంగా నిర్వహించాల్సిన గ్రామసభను నాలుగు గోడల చాటున మధ్యన సచివాలయంలో నిర్వహించడం ఏమిటని లబ్ధిదారులు ప్రశ్నిస్తూ ఉండటం కొసమెరుపు. యోగ కార్యక్రమానికి సంబంధించి ప్రజలను ఆన్లైన్లో నమోదు చేయించాలని కలెక్టర్ నుండి ఆదేశాలు రావడంతో, నమోదుకు వచ్చిన ఉపాధి కూలీలను హౌసింగ్ శాఖ నిర్వహించిన గ్రామసభలో కూర్చోబెట్టడం మరో కొస మెరుపు.

# జూన్ 19 వ తేదీ న నంద్యాల జిల్లా స్థాయి చెస్ పోటీలు

### శ్రీ రామకృష్ణ డిగ్రీ కాలేజ్ స్వామి వివేకానంద ఆడిటోరియంలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక



**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 16 ( నంది పత్రిక )** ఆంధ్ర చెస్ అసోసియేషన్ నిర్వహించబోయే రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక కోసం నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 19 వ తేదీ , శుక్రవారం ఉదయం 9 గంటల నుండి శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల స్వామి వివేకానంద ఆడిటోరియం లో నంద్యాల జిల్లా స్థాయి అమెచ్యూర్ చెస్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని నంద్యాల జిల్లా చెస్ అధ్యక్షులు, ఆంధ్ర చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్ డాక్టర్. జి. రవికృష్ణ, కార్యదర్శి రామసుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 వ తేదీ సాయంత్రం 6 గంటల లోపు ఏపీ చెస్ వెబ్సైట్లో ఎంట్రీలు నమోదు చేసుకోవాలని నంద్యాల జిల్లా ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగబోవు రాష్ట్రస్థాయి చదరంగా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు ఎంట్రీలు నమోదు చేసుకోవడానికి, ఇతర వివరాలకు సంప్రదించవలసిన నెంబర్ 9010451585.

# ఎస్ఐఆర్ ప్రత్యేక ఓటర్ సవరణను పరిశీలించిన టీడీపీ నాయకులు.



**వెలుగోడు, జూన్ 16 (నంది పత్రిక):** తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు , శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సూచనలతో వెలుగోడు పట్టణంలోని జమ్మి నగర్‌లో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రత్యేక ఓటర్ సవరణ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవెల్ అధికారి ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియను టీడీపీ బూత్ లెవెల్ అధికారితో కలిసి నాయకులు పరిశీలించి ఎస్ ఐ ఆర్ గురించి ఓటర్లకు వివరించడం జరిగింది. ఓటర్ల వివరాలను సరిచూసి, ఎన్యూమరేషన్ ప్రక్రియ సక్రమంగా జరుగుతున్న తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా నాయకులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటర్ జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ ఖలీల్ ఖాన్, టీడీపీ మండల అధ్యక్షులు కలాం, సొసైటీ చైర్మన్ మండ్ల శంకర్ రెడ్డి, సీనియర్ నాయకులు అమీర్ హంజా, డీజిల్ రమణ, నాగరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్య భాగ్యం..!!





## ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణ రెడ్డి

## గండికోట లో ఉత్సాహవంతంగా సాగిన పర్యాటక యోగాంధ్ర కార్యక్రమం

**జమ్మలమడుగు, బ్యూరో చీఫ్ జూన్ 16: నంది పత్రిక**

యోగా తోనే సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్య భాగ్యం సిద్ధిస్తుందని.. దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలని.. ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. 12 యోగాంధ్ర పక్షోత్సవాల్లో భాగంగా.. మంగళవారం పర్యాటక యోగా థీమ్ తో.. గండికోట చారిత్రక పర్యాటక క్షేత్రంలో.. జిల్లా పర్యాటక, ఆయుష్ శాఖల ఆధ్వర్యంలో వేలాది మంది పౌరులతో యోగా గురువులు యోగాసనాలు వేయించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ విప్,జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణ రెడ్డి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విప్ మరియు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ..లి ప్రాచీనకాలం నుండి యోగా సాధనతో.. ఎందరో మునులు,ఋషులు, యోగులు తపోనిష్ట సమయంలో.. అనారోగ్యాలు దరిచేరకుండా యోగాసనాలు, ప్రాణాయామాలు చేస్తూ సంపూర్ణ ఆరోగ్యాన్ని తమ సొంతం చేసుకున్నారని గుర్తు చేశారు.మానసిక సమస్యలకు,శారీరక రుగ్మతలకు యోగ మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని..యోగా ప్రాముఖ్యత,విశిష్టతను విస్తృతం చేస్తూ.. జూన్ 7 నుండి నుండి జూన్ 21 వరకు రాష్ట్ర ప్రభుత్వం "యోగాంధ్ర క్యాంపెన్ -2025" ను అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా మన జిల్లాలో కూడా యోగా చేయడం వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలను విశదీకరిస్తూ.. జిల్లా స్థాయి నుండి మండల స్థాయి వరకు పౌరులకు యోగా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. పర్యాటక యోగ థీమ్ లో భాగంగా ఈ రోజు అత్యంత చారిత్రాత్మక ప్రదేశం అయిన గండికోట పర్యాటక క్షేత్రంలో నిర్వహించడం సంతోషించ దగ్గ విషయం అని,ఈ కార్యక్రమం నిర్వహణ జిల్లాకే గర్వకారణం అన్నారు. "హ్యాపీ ఆంధ్రప్రదేశ్ - హెల్తీ ఆంధ్రప్రదేశ్" అన్న నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో యోగాంధ్ర పేరుతో నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఒక్కరికి ఆరోగ్య భాగ్యాన్ని కల్పించాలనే ఉద్దేశ్యం తో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమాన్ని మోటివేషనల్ ప్రోగ్రామ్ గా నిర్వహించడం జరుగుతోందన్నారు. యోగాసనాలు వేయడం ద్వారా..క్రమశిక్షణ, మెరుగైన జీవన విధానం అలవడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను నిత్యజీవితంలో ఒక దిన చర్యగాఅలవర్చుకోవాలన్నారు.యోగాంధ్ర కార్యక్రమాల్లో జిల్లా యంత్రాంగం చేస్తున్న కార్యక్రమాలు ప్రశంసనీయం అన్నారు.ఈ రోజు పర్యాటక యోగా కార్యక్రమాన్ని జిల్లా లోని సుప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన గండికోట లో ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు.గండి కోట జిల్లాలోనే అత్యంత సుభిక్షమైన ప్రాంతం అని,ఇక్కడ ప్రవహించే పెన్నానది పుణ్యదాయకమైనదన్నారు. అందుకే.. ఈ జమ్మలమడుగు నియోజకవర్గ ప్రాంతం అన్ని రకాల వనరులతో రాష్ట్ర, దేశ ఆర్థిక ప్రగతికి మైలురాయిగా విలసిల్లుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమ ను సుభిక్షం చేసే దిశగా అడుగులేస్తోందన్నారు. బనకచర్ల గోదావరి ప్యాకేజీ ద్వారా మన రాయలసీమకు నీరు అందిస్తే ఇక్కడి రైతాంగానికి,పారిశ్రామిక రంగానికి అంతకంటే భాగ్యం ఇంకొక్కటి ఉండదన్నారు. అత్యంత చారిత్రక వైభవం ఉన్న గండికోట ప్రాంతం పెన్నా నది తీరంలో సుభిక్షమైన వ్యవసాయ ఆధారిత ప్రాంతాలు, పారిశ్రామిక వాడలకు ప్రత్యేక ఆకర్షణగా వెలుగిందుతోందన్నారు.



సోలార్,వ్యాపార,పారిశ్రామిక రంగాలతో అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతానికి భవిష్యత్తులో ప్రపంచస్థాయి లో విశిష్టమైన గుర్తింపు లభిస్తుందని ఆకాంక్షించారు. పర్యాటక మ్యాపులో ఇప్పటికే ఒక విశిష్టమైన స్థానాన్ని సంపాదించిన గండికోట.. పర్యాటకంగా మరిన్ని అభివృద్ధి పనులతో ప్రపంచ ప్రఖ్యాతిగాంచనుందన్నారు. ఈ యోగా కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తమ స్వీయ బాధ్యతగా స్వీకరించి.. సామాజిక ఆరోగ్య పరిరక్షణకు పాటు పడాలన్నారు.ప్రతి ఇంటి లోనూ ప్రతి గ్రామంలోనూ ప్రతి మండలంలోనూ ప్రాధాన్యతతో యోగా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ యోగాంధ్ర మాసోత్సవాల్లో నేర్చుకున్న యోగా ఆసనాలను.. ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి నిత్య జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్నిపురస్కరించుకొని జూన్ 21వ తేదీ వరకు జిల్లా యంత్రాంగం,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో జిల్లా ప్రజలు విస్తృతంగా పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్ డి ఓ శిరీష,జెడ్పి సీఈఓ సుబ్రహ్మణ్యం,డిఎంహెచ్ఓ డా. నాగరాజు,ఆయుష్ నోడల్ అధికారి రవికుమార్, టూరిజం అధికారి సురేష్ కుమార్,తహశీల్దార్ సాయినాథ్ రెడ్డి, జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, గండికోట గ్రామ ప్రజా ప్రతినిధులు ఈశ్వర్, జిల్లా అధికారులు,ఆయుష్ సిబ్బంది, పలు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, పెద్ద ఎత్తున మహిళలు,యువత పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రత్యేక ఓటర్ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు





**వెలుగోడు, జూన్ 16 (నంది పత్రిక):** శ్రీశైలం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆదేశాల మేరకు వెలుగోడు మండల కేంద్రం 104వ పరిధిలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రత్యేక ఓటర్ సవరణ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవెల్ అధికారి తో కలిసి వైఎస్సార్‌సీపీ బూత్ లెవెల్ ఏజెంట్ ఎస్. అబ్దుల్ వాహిద్ ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. ఓటర్ల వివరాలను పరిశీలించి, ఎన్యూమరేషన్ ఫారాలను అందించి ఓటర్లకు వివరించడం జరిగింది.ఈ సందర్భంగా ఓటర్ల వివరాలను సరిచూసుకుని, అవసరమైన మార్పులు ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, ఓటర్ సవరణ ప్రక్రియ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంతాన ఉత్పత్తి ద్వారా ఆర్థిక అభివృద్ధి

### ఏడి డాక్టర్ వెంకటేశ్వర్లు

**బండి ఆత్మకూరు నంది పత్రికజూన్ 16 :** వెలుగోడు సబ్ డివిజన్ పశు వైద్యశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వర్లు మంగళవారం బండి ఆత్మకూరు ఏ కోడూరు పశు వైద్య కేంద్రాలను సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ పశుపోషకులు పశువుల సంతాన ఉత్పత్తిని పెంచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. ఈ సందర్భంగా పశు వైద్య కేంద్రాలలో పశువుల మంద సంతానోత్పత్తి పుస్తకాన్ని ఆవిష్కరించారు. పశువులలో ఎద సమయాన్ని తగ్గించి తద్వారా సంతాన ఉత్పత్తి ని పెంచుకుంటే సంతాన ఉత్పత్తి పెరిగి పాడి పశు పోషకులకు ఆర్థికంగా ప్రయోజనం చేపడుతుందని తెలిపారు. జంతు ప్రజన కేంద్రీయత విధానం ద్వారా పశువులలో ఆరోగ్యకరమైన సంతానాన్ని ఉత్తమ లక్షణాలతో పాటు ఉత్పాదకతను పెంచాలని పశువైద్యాధికారులకు సూచించారు. గుర్తించిన పశువుల వివరాలను హార్ట్ ఫెర్టిలిటీ బుక్కులో నమోదు చేయాలని అన్నారు. దీని ద్వారా రైతులకు ఆర్థిక రావడంలను పెంపొందించడంతోపాటు పశువులలో జన్యుపరమైన మెరుగుదలలు పునరుత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరచడంతో పాటు వ్యాధి నిరోధకతను పెంచుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డాక్టర్ జోష్నా దేవి డాక్టర్ అనూష తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.



# సుంకలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి

**బోయరేవుల, జూన్ 16 (నంది పత్రిక):** వెలుగోడు మండలం బోయరేవుల గ్రామంలో నిర్వహించిన సుంకలమ్మ తల్లి ఆలయ 9వ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డ రాజశేఖర రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందించారు. గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి సేవల్లో నిమగ్నమయ్యారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ ప్రజలకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామంలో భక్తి, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను పెంచుతోంది.కార్యక్రమంలో స్థానిక టీడీపీ గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తాం





## రెండేళ్లలో అభివృద్ధి సంక్షేమాల్లో అద్భుత ప్రగతి డోన్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం డోన్ ఎమ్మెల్యే కోట్ల

**నండిపత్రిక –డోన్** ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తామని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు.ప్రజల ఆశీస్సులతో ఏర్పడిన కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డోన్ పట్టణంలో "2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం" విజయోత్సవ సభను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సాయి ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా అభివృద్ధి, సంక్షేమాలను రెండు కళ్లుగా చేసుకుని ముందుకు సాగుతోందని కొనియాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో పనిచేస్తోందని స్పష్టం చేశారు.

**మౌలిక సదుపాయాలు, సంక్షేమానికి పెద్దపీట:** రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్య, వైద్యం, తాగునీరు, రహదారుల నిర్మాణం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పన వంటి రంగాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

డోన్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే కోట్ల వివరించారు. నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య పనుల మెరుగుదలతో పాటు సంక్షేమ కార్యక్రమాల అమలులో విశేష పురోగతి సాధించామని లెక్కింపజేశారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు కేటాయించి, డోన్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఒక ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలూ కృషి చేస్తామని వెల్లడించారు.

ప్రభుత్వంపై నమ్మకంతో సహకరిస్తున్న ప్రజలందరికీ ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రగతి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా నిరంతరం శ్రమిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో యువ నాయకులు కోట్ల రాఘవేంద్ర రెడ్డి, డోన్ నియోజకవర్గ అబ్జర్వర్ గోవర్ధన్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, ఆర్డీవో నరసింహులు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, ఎంపీడీవోలు శ్రీనివాసులు, ఫజల్ రెహమాన్, వలసల రామకృష్ణ, డోన్ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజారేణుక, ఖాజా పీర్, కుమ్మరి సుధాకర్,కొంగణపల్లె మధు,కేశవయ్య గౌడ్, రాఘవేంద్ర గౌడ్, రఫీ, ఆర్ ఇ నాగరాజు పాల్గొన్నారు.





## తాగునీటి సమస్య పరిష్కారానికి మరో కీలక అడుగు ఎమ్మెల్యే కోట్ల



**నండిపత్రిక –డోన్** డోన్ పట్టణ ప్రజల దశాబ్దాల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా మరో కీలక అడుగు పడిందని డోన్ ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మంగళవారం వాటర్ గ్రిడ్' ప్రాజెక్టులో భాగంగా... డోన్ కొండపైన నూతనంగా ఏర్పాటు చేసిన 630 ఖవా ట్రాన్స్‌ఫార్మర్ యార్డ్ 1200 ఖు క్లియర్ వాటర్ పంప్ హౌస్‌కు విద్యుత్ సరఫరాను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... డోన్ పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం అత్యంత కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు."వాటర్ గ్రిడ్‌కు విద్యుత్ సరఫరా ప్రారంభం కావడంతో ప్రాజెక్టు పనులు మరింత వేగవంతం అవుతాయని రాబోయే రోజుల్లో డోన్ పట్టణ ప్రజలందరికీ మెరుగైన, నాణ్యమైన తాగునీటి సేవలు నిరంతరాయంగా అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వలసల రామకృష్ణ, సలీంద్ర శ్రీనివాసులు, ఆర్డబ్ల్యూఎస్ డీఈ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఆలస్యమైన రుతుపవనాలు...

భారత ఆర్థిక రాజధాని ముంబై తీవ్ర నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. నగరానికి నీటిని సరఫరా చేసే ఏడు ప్రధాన సరస్సులలో నీటి మట్టాలు కేవలం 10.35 శాతానికి పడిపోవడంతో బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) కఠిన చర్యలకు ఉపక్రమించింది. జూన్ 17 నుంచి నూతన ఆంక్షలు అమల్లోకి వస్తాయని అధికారులు ప్రకటించారు.కొత్త నిబంధనల ప్రకారం, పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, స్పోర్ట్స్ క్లబ్‌లకు రోజువారీ నీటి సరఫరాలో 20 శాతం మేర కోత విధించారు. ఇప్పటికే మే మధ్య కాలం నుంచి గృహ వినియోగదారులకు అమలవుతున్న 10 శాతం కోత యథాతథంగా కొనసాగనుంది.

## సంక్షేమం అభివృద్ధి ఒక నైతిక బాధ్యత




**విజయవాడ, నంది పత్రిక జూన్ 16.** ఒక న్యాయమైన, మానవతాయుత సమాజ నిర్మాణానికి సామాజిక భద్రత మరియు ప్రజా సంక్షేమం అనేవి అత్యంత కీలకమైన పునాదులు. ఈ సూత్రాలను విస్మరించి ఏ సమాజమూ పురోగతిని సాధించలేదు. అభివృద్ధి అంటే కేవలం భౌతిక వృద్ధి మాత్రమే కాదు, సమాజంలోని చివరి వ్యక్తికి కూడా కనీస గౌరవం, ఆత్మసమ్మానం లభించడం. ఇస్లాం పేదరిక నిర్మూలనను, సామాజిక సహాయాన్ని కేవలం దానధర్మాలుగా మాత్రమే కాకుండా, వ్యక్తుల మరియు సమాజం యొక్క నైతిక బాధ్యతగా పరిగణిస్తుంది. ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలో భారతదేశం వంటి దేశాలు పేదరికాన్ని తగ్గించడం, ఆహార భద్రత, మెరుగైన వైద్యం, నాణ్యమైన విద్య మరియు ఉపాధి అవకాశాలను కల్పించడం లక్ష్యంగా అనేక పథకాలను అమలు చేస్తున్నాయి. ఈ ప్రయాణంలో యువత కీలక పాత్ర పోషించాలి. ముఖ్యంగా నిరక్షరాస్యత, నిరుద్యోగం వంటి సమస్యలను నిర్మూలించడానికి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు మరియు వ్యక్తులు చేపడుతున్న కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వాములు కావాలి. ప్రథమ సామాజిక శాసనం, చరిత్రను పరిశీలిస్తే, క్రీ.శ. 622లో ప్రవక్త ముహమ్మద్ మదీనాలో రూపొందించిన శాసనం ప్రపంచ చరిత్రలో ఒక మైలురాయి. అది న్యాయం, సహకారం మరియు పరస్పర రక్షణ ప్రాతిపదికన వివిధ వర్గాల మధ్య సంబంధాలను బలోపేతం చేసింది. పౌరుల సమానత్వం, కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా పౌరులందరికీ సమాన గౌరవం మరియు చట్టబద్ధమైన రక్షణ కల్పించడం. సామూహిక భద్రత. బలహీనులకు అండగా నిలవడం, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడం. ఇది ఆధునిక సంక్షేమ రాజ్యాలకు ప్రాథమిక నమూనా. పరిపాలనలో న్యాయం. చట్టం ముందు అందరూ సమానమేనని, అణచివేతకు తావులేకుండా వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ఈ వ్యవస్థ నిర్దేశించింది. ఖురాన్ వచనాలు సంపద కేవలం ధనవంతుల మధ్యనే కేంద్రీకృతం కాకూడదని, సమాజంలోని పేదలు, అనాథలు, వలసదారులు మరియు అవసరార్థుల సంక్షేమం కోసం అది వినియోగించబడాలని స్పష్టం చేస్తున్నాయి. సంక్షేమం అనేది ఒక సామాజిక హక్కు. ఆధునిక కాలంలో ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, ఆరోగ్య బీమా, విద్య మరియు ఉపాధి పథకాలు ఈ సంక్షేమ దృక్పథానికి నిదర్శనాలు. ప్రభుత్వ పథకాల విజయం కేవలం ప్రణాళికల మీదనే ఆధారపడి ఉండదు. అర్హులైన ప్రజలకు ఆ పథకాలు చేరుతున్నాయా లేదా అన్నది చాలా ముఖ్యం. అనేక సందర్భాల్లో, అవగాహన లేకపోవడం, ధృవీకరణ పత్రాల కొరత, సాంకేతిక ఇబ్బందుల వల్ల పేదలు ప్రభుత్వ ఫలాలను అందుకోలేకపోతున్నారు. ఈ అంతరాన్ని తగ్గించడానికి విద్యావంతులైన యువత ముందుకు రావాలి. అవగాహన కల్పించడం. ప్రభుత్వ పథకాల గురించి తెలియని వారికి వివరించడం. సహాయ సహకారాలు.దరఖాస్తు ప్రక్రియలో వారికి తోడ్పడటం. జవాబుదారీతనం, సంక్షేమ పరిపాలనలో పారదర్శకతను కోరడం. సమాజం బలంగా, సంపన్నంగా మారాలంటే మనం ఒకరికొకరు తోడుగా ఉండాలి. కులమతాలకు అతీతంగా, మానవత్వమే ప్రాతిపదికగా, అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రతి పౌరుడు కృషి చేయాలి. అప్పుడే మనం ఒక పరిపూర్ణమైన, ఆరోగ్యకరమైన సంక్షేమ సమాజాన్ని నిర్మించుకోగలుగుతాము

## నారాయణ యాదవ్ కు అండగా ఉంటాం

### -పుత్తా నరసింహ రెడ్డి



**కడప. జూన్ 15 . (నంది పత్రిక ):** కడప నియోజకవర్గం లోని చింతకొమ్మ దీన్నే మండలం లోని బిసిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ కి చెందిన అప్పారాజుపల్లి గ్రామానికి చెందిన నారాయణ యాదవ్ కి అనారోగ్యంతో కడప నగరంలోని ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న ఆయన్ను పుత్తా నరసింహ రెడ్డి మరియు ఆ గ్రామపంచాయతీ నాయకులు పరామర్శించారు.

## హోం మంత్రి పై మాజీ మంత్రి అమర్నాథ్ వ్యాఖ్యలు అభ్యంతరకరమైనవి



**బనగానపల్లె జూన్ 16నందిపత్రిక** రాష్ట్ర హోం మంత్రి అనిత పై మాజీ మంత్రి అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బనగానపల్లె జనసేన పార్టీ మహిళా నాయకురాలు జాఫరున్నిస పేర్కొన్నారు. మంగళవారం ఒక ప్రకటన ద్వారా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగ పదవిలో ఉన్న ఒక దళిత మహిళ అయినటువంటి హోం మంత్రి అనిత ని రాజకీయంగా ఎదుర్కోలేక కట్టుబొట్టుపై విమర్శలు చేయడం హాస్యాస్పదం రాజకీయాల్లో విమర్శలు విధానపరంగానే ఉండాలి కానీ మహిళలను కించపరిచే విధంగా ఉండకూడదు ఇది ఒక అనిత పైన కాకుండా సగటు మహిళలందరినీ కించపరచడమే కావున ఈ వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకొని సగటు మహిళలందరికీ క్షమాపణ చెప్పవలసినదిగా బనగానపల్లె జనసేన పార్టీ మహిళా నాయకురాలు జాఫరున్నిస కోరారు.

## ఎన్‌డీపీఎస్ కేసుల్లో స్వాధీన సామగ్రి భద్రతపై ప్రత్యేక దృష్టి..!

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి





**కడప, బ్యూరో చీఫ్ జూన్ 16 నంది పత్రిక** : ఎన్‌డీపీఎస్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వస్తు సామగ్రి భద్రత కోసం జిల్లాలో చేపట్టిన భవన నిర్మాణ పనులు త్వరితగతిన. పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.మంగళవారం రాష్ట్ర రాజధాని నుండి రాష్ట్రక్కౡ హైకోర్టు జ్యూడిషియల్ రిజిస్ట్రార్ ఎస్. కమలాకర రెడ్డి సంబంధిత న్యాయమూర్తులతో కలిసి.. ఎన్‌డీపీఎస్ (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్) చట్టం కింద స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలు, నిషేధిత వస్తువుల భద్రత కోసం జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్న శాశ్వత నిల్వ కేంద్రాల నిర్మాణ పురోగతిపై.. అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి హాజరై.. జిల్లాలో ఎన్‌డీపీఎస్ కేసులకు సంబంధించి స్వాధీనం చేసుకున్న వస్తువుల తాత్కాలిక, శాశ్వత భద్రతా ఏర్పాట్లు, అందుబాటులో ఉన్న భద్రతా సదుపాయాలు, నిర్మాణ పనుల పురోగతిపై రాష్ట్ర హైకోర్టు జ్యూడిషియల్ రిజిస్ట్రార్ కు వివరించారు. జిల్లా ఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో ఎన్‌డీపీఎస్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న సామగ్రిని భద్రపరిచేందుకు ఒక భవనాన్ని ఏర్పాటు చేసేందుకు తాజాగా భూమి పూజచేసి పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు.ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. అందులో మౌలిక సదుపాయాలు, సామగ్రి నిల్వ, భద్రతా చర్యలపై జిల్లా పోలీసు యంత్రాంగంతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామన్నారు. అంతకు ముందు విసీలో హైకోర్టు రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల మేరకు ఎన్‌డీపీఎస్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న నిషేధిత పదార్థాల భద్రత కోసం ప్రతి జిల్లాలో శాశ్వత నిల్వ కేంద్రాల నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత భవనాల నిర్మాణ పనుల పురోగతి, తాత్కాలిక నిల్వ సదుపాయాలు, భద్రతా చర్యలపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అన్ని జిల్లాల్లో శాశ్వత నిల్వ కేంద్రాల నిర్మాణాన్ని వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సమావేశంలో సూచించారు.ఈ కార్యక్రమంలో డిఆర్వో మల్లికార్జునుడు, కలెక్టరేట్ ఏవో గంగయ్య, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## హోం శాఖ మంత్రి అనిత పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి అమర్నాథ్



**నంది పత్రిక ఆత్మకూరు..** నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం శాసన సభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశానుసారం నిన్న రాష్ట్ర మాజీ మంత్రి వైసీపీ నాయకులు గుడివాడ అమరనాథ్ ప్రస్తుత రాష్ట్ర హోమ్ మంత్రి వంగలపూడి అనిత మీద అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ అమర్నాథ్ ఫోటోను చెప్పులతో కొట్టి, వినూత్నంగా కోడి గుడ్లతో కొట్టి నిరసన తెలియజేసి, స్థానిక పోలీస్ స్టేషన్ లో అమర్నాథ్ మీద ఫిర్యాదు చేసిన ఆత్మకూరు పట్టణ మరియు మున్సిపాలిటీ టీడీపీ తెలుగు మహిళలు.. పాల్గొని నిరసన వ్యక్తం చేసినారు



# సూక్ష్మ చిన్న మధ్య తరహా వ్యాపారాలు డిజిటల్ మార్కెటింగ్ లో సరికొత్త అవకాశాలు సాంకేతికతపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి




## జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి

**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 16 నంది పత్రిక** సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వ్యాపారాలు, స్టార్టప్‌ల సంస్థలు డిజిటల్ మార్కెటింగ్ లో సరికొత్త అవకాశాలు పొందే విధంగా సాంకేతికత పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టీ.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. నర్సాపురంలోని శ్రీ అల్లూరి సత్యనారాయణ రాజు కల్చరల్ సెంటర్ లో మంగళవారం భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహకారంతో, నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్, ఎంఎస్ ఎంఈ టీమ్ సంయుక్తంగా మహిళలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాల గ్రూపుల వారికి ప్రత్యేకంగా ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ నిర్వహించిన అవగాహన సదస్సు లో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వ్యాపారస్తులు తయారుచేసిన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లో ఆన్లైన్ ద్వారా విక్రయిస్తే తక్కువ పెట్టుబడిలతో ఎక్కువ లాభాలు వస్తాయని అన్నారు. దళారీల ప్రమేయం లేకుండా జరిగే వ్యాపారంలో లాభాలతో పాటు మోసాలకు తావు ఉండదని అన్నారు. ఆధునిక రంగంలో ప్రజల అభిరుచులకు అనుగుణంగా వస్తువులను తయారు చేస్తే త్వరగా ఉత్పత్తులు అమ్మకాలు జరుగుతాయని అన్నారు. ఉత్పత్తుల తయారీలో సాంకేతికతను వినియోగించి తయారు చేస్తే మరింత మన్నికగా, ఆకర్షణీయంగా వస్తువులు తయారవుతాయని అన్నారు. తయారుచేసిన ఉత్పత్తులకు ఆన్లైన్లో ప్రచారం చేసుకునే విధంగా అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఆధునిక టెక్నాలజీ వినియోగం ద్వారా ఉత్పత్తుల నాణ్యత పెంపు, మార్కెట్ విస్తరణ, ఉపాధి అవకాశాల సృష్టి సాధ్యమవుతుందని తెలిపారు. ఆధునిక టెక్నాలజీతో సమయం, వనరుల వృథాను తగ్గించి తక్కువ వ్యయంతో ఎక్కువ నాణ్యత గల ఉత్పత్తులను తయారు చేస్తే అధిక లాభలు వస్తాయని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్ వంటి ఆధునిక సాంకేతికతలను వినియోగించడం ద్వారా పరిశ్రమలు పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోగలవని అన్నారు. మహిళలు, పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాల గ్రూపులు, యువత స్వయం ఉపాధి రంగంలో ముందుకు రావాలని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న వనరులను విద్యుత్, ముడి సరుకు, కార్మిక ఖర్చులను తగ్గించి ఉత్పత్తి చేయడం వలన అధిక లాభలు వస్తాయని అన్నారు. పెద్ద కంపెనీలకే పరిమితమైన ఇ-కామర్స్ రంగాన్ని భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఓఎన్డిసి ఒక విప్లవాత్మకమైన వేదిక అన్నారు. దీని ద్వారా చిన్న వ్యాపారులకు సైతం పెద్ద ఇ-కామర్స్ సంస్థలతో సమానంగా డిజిటల్ మార్కెట్‌లో పోటీ పడే అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. చిన్న వ్యాపారులు రిజిస్ట్రేషన్ విధానం నిపుణులచే పూర్తి అవగాహన కల్పిస్తారన్నారు. దళారీల ప్రమేయం లేకుండా, తక్కువ ఖర్చుతో దేశవ్యాప్తంగా వినియోగదారులకు తమ ఉత్పత్తులను నేరుగా ఆన్లైన్ ద్వారా ఎలా విక్రయించాలో వివరిస్తుందన్నారు. డిజిటలైజేషన్ కోసం ఎం ఎస్ ఎం ఈ., ఎన్ ఎస్ ఐ సి., అందిస్తున్న వివిధ రకాల సబ్సిడీలు, మార్కెటింగ్ సపోర్ట్, లోన్ పథకాలు వంటి విషయాలపై అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వ్యాపారాలు మరియు స్టార్టప్‌ల సంస్థలను డిజిటల్ రంగంలో సాంకేతికతను అందిపుచ్చుకుని వ్యాపారాన్ని విస్తరించుకోవాలనుకునే ప్రతి ఒక్క వ్యాపారవేత్త, స్టార్టప్ నిర్వాహకులు ఈ సదస్సులో పాల్గొని అవగాహన పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇండస్ట్రియల్ జోనల్ మేనేజర్ వి.సురేష్, డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం ఎస్ ఎస్ వేణుగోపాల్, ఇండస్ట్రియల్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీపతి, యు బి ఐ రీజినల్ డైరెక్టర్ వీరభద్రరావు, ఈపీ సిహెచ్ డైరెక్టర్ కె.తులసీరామ్, షేడ్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ సుధీర్ కుమార్, హ్యాండ్లూమ్స్ ఏడి అపర్ణ లక్ష్మి, ఎమ్.ఎస్.ఎం.ఇ మంత్రిత్వ శాఖ అధికారులు, ఎన్.ఎస్.ఐ.సి ప్రతినిధులు, ఓ ఎన్ డి సి నిపుణులు తదితరులు పాల్గొన్నారు. .



# షాదీఖానా నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి



**బనగానపల్లె జూన్ 16 నందిపత్రిక** బనగానపల్లె పట్టణంలో మంత్రి ఆధ్వర్యంలో నిర్మితమౌతున్న షాదీఖానా నిర్మాణ పనులను మంగళవారం మంత్రి పరిశీలించారు. ముస్లిం మైనార్టీ సోదరుల సౌకర్యార్థం అత్యాధునిక వసతులతో నిర్మించిన షాదీ ఖానా భవనం నిర్మాణం పూర్తయి తుదిమెరుగులు దిద్దుకుంటున్న నేపథ్యంలో మంత్రి పరిశీలించారు.తుది మెరుగుల అనంతరం మంత్రి షాదీఖానను ప్రారంభించి ముస్లిం సోదరులకు అంకితమివ్వనున్నారు.

# వాల్ నిర్మాణం వలన పీఎం లంక ప్రజలు ప్రకృతి వైపరీత్యాలకు తుఫాన్లకు సురక్షితం

## జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి



**నరసాపురం బ్యూరో చీఫ్ జూన్ 16, నంది పత్రిక**నర్సాపురం పీఎం లంకలో ఒక కిలోమీటర్ పొడవున ఢిల్లీ డిలైట్ కంపెనీ రూ.13 కోట్ల సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన సముద్రపు కోత నిరోధక అడ్డుగోడను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పూనేకి చెందిన గార్వేర్ కంపెనీవారు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలియజేశారు. ప్రొటెక్షన్ వాల్ వలన తుఫాను, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నీరు గ్రామంలోకి చేరకుండా గ్రామాన్ని సురక్షితంగా ఉంచుతుందని అన్నారు. వాల్ నిర్మాణం వలన పిఎం లంక ప్రజలు ప్రకృతి వైపరీత్యాలకు, తుఫానులకు భయపడనవసరం లేదని సురక్షితంగా ధైర్యంగా ఉండవచ్చని అన్నారు. ఈ పర్యటనలో భీమవరం ఆర్డీవో దాసిరాజు, డ్రైన్స్ ఇఇ సిహెచ్ సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.



# 21 విడతలుగా నిర్వహించిన రెవిన్యూ క్లినిక్ ల ద్వారా 469 దరఖాస్తులు పరిష్కారం

## భూ సమస్యల పరిష్కారంలో సత్వర మార్గాన్ని చూపుతున్న రెవెన్యూ క్లినిక్స్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్స్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 16 నంది పత్రిక** రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్స్ ఉత్తమ ఫలితాలను అందిస్తున్నాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికతో పాటు భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్స్ నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. 2025 డిసెంబర్ 29న ప్రారంభమైన రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 2026 జూన్ 15 వరకు మొత్తం 21 విడతలుగా కార్యక్రమం నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. ఈ కాలంలో జిల్లావ్యాప్తంగా మొత్తం 815 దరఖాస్తులు అందగా, వాటిలో 309 దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందన్నారు. అర్హతలు, నిబంధనల ప్రకారం 160 దరఖాస్తులను తిరస్కరించగా, ప్రస్తుతం 346 దరఖాస్తులు వివిధ దశల్లో పరిష్కార ప్రక్రియలో ఉన్నాయని వివరించారు. డివిజన్ వారీగా పరిశీలిస్తే భీమవరం డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో 357 దరఖాస్తులు అందగా, వాటిలో 132 దరఖాస్తులు పరిష్కరించబడినట్లు తెలిపారు. 66 దరఖాస్తులు తిరస్కరించగా, మరో 159 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. నరసాపురం డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల్లో 295 దరఖాస్తులు అందగా, 119 దరఖాస్తులను పరిష్కరించామని, 55 దరఖాస్తులను తిరస్కరించామని, మరో 121 దరఖాస్తులు పరిష్కార దశలో ఉన్నాయని వెల్లడించారు. తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో 163 దరఖాస్తులు అందగా, 58 దరఖాస్తులను పరిష్కరించామని, 39 దరఖాస్తులను తిరస్కరించామని, మిగిలిన 66 దరఖాస్తులపై విచారణ కొనసాగుతోందన్నారు. భూ సమస్యలపై అందిన ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, భవిష్యత్తులో ఎటువంటి వివాదాలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ప్రజలకు త్వరితగతిన పరిష్కారాలు లభిస్తున్నాయని, ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు..

# రీ-సర్వే ప్రక్రియలో రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలి

## గ్రౌండ్ ట్రూతింగ్, ఈ-కేవైసీ పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు

## జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి.

**నరసాపురం బ్యూరో చీఫ్ జూన్ 16 నంది పత్రిక** నరసాపురం మండలం వేములదీవి గ్రామంలో జరుగుతున్న భూ రీ-సర్వే కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రీ-సర్వేలో కీలకమైన గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని సంబంధిత రెవెన్యూ అధికారులకు సూచనలు జారీ చేశారు. గ్రామంలోని భూ యజమానులు, రైతులకు ముందస్తుగా నోటీసులు జారీ చేసి, నిర్ణీత తేదీల్లో తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు తమ భూములకు సంబంధించిన రికార్డులు, ఫీల్డ్ మ్యాపులు, ఆన్‌లైన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఏవైనా తప్పులు లేదా వ్యత్యాసాలు గుర్తించినట్లయితే వెంటనే సవరణలు చేసుకోవాలని సూచించారు. అలాగే రికార్డులు సక్రమంగా ఉన్న రైతులకు ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తిచేసి, భూ వివరాలను డిజిటల్ రికార్డుల్లో ఖచ్చితంగా నమోదు చేసేలా చర్యలు చేపట్టాలని రెవెన్యూ శాఖ సిబ్బందికి సూచించారు. రీ-సర్వే ద్వారా భూ రికార్డుల్లో పారదర్శకత పెరగడంతో పాటు భవిష్యత్తులో భూ వివాదాలు తగ్గే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రికార్డుల ఆధునికీకరణ కార్యక్రమంలో రైతులు చురుకుగా పాల్గొని, తమ భూముల వివరాలు సక్రమంగా నమోదయ్యేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరసాపురం ఆర్డీఓ దాసిరాజు, మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి, మండల తహసిల్దార్ వి.సత్యనారాయణ, సర్వేయర్లు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మొగల్తూరు హైవే ప్రాంతంలో జాయింట్ కలెక్టర్ సుడిగాలి పర్యటన





## షాపు యజమానులు ఇష్టానుసారం చెత్తను వేస్తే చర్యలు తప్పవు క్యారీ బ్యాగులలో ఆహార పదార్థాలు ఉంచితే క్యాన్సర్ వంటి రోగాలకు దారి తీస్తాయి

## జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

**నరసాపురం: బ్యూరో చీఫ్ జూన్ 16, నంది పత్రిక**

నర్సాపురం వద్ద మొగల్తూరు హైవే మార్గంలో మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సుడిగాలి పర్యటలో భాగంగా షాపులు, హోటల్స్ వద్ద బహిరంగ ప్రదేశాలలో చిందరవందరగా ఉన్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను గమనించి సంబంధిత షాపుల వద్దకు వెళ్లి షాపులో వస్తున్న వ్యర్థాలను ఇష్టానుసారంగా బయట పడవేయటం వలన వాతావరణం కాలుష్యంతో పాటు అంటు రోగాలు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. ప్రతి షాప్ యజమాని వారి షాపు ముందే చెత్తబుట్టను ఏర్పాటు చేసుకొని దానిలో మాత్రమే వ్యర్థాలను ఉంచాలని సూచించారు. చెత్తబుట్టలో ఉంచిన వ్యర్థాలను శానిటేషన్ సిబ్బంది వచ్చినప్పుడు అప్పగించాలని అన్నారు. కర్రీ పాయింట్ వద్ద ప్లాస్టిక్ కవర్లను గమనించిన జాయింట్ కలెక్టర్ వేడి వస్తువులను ప్లాస్టిక్ కవర్లలో ఉంచితే క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులు వస్తాయని, ప్లాస్టిక్ సంచులను వినియోగించరాదని హెచ్చరించారు. పండ్ల వ్యాపారం చేస్తున్న బండి వద్ద ప్లాస్టిక్ కవర్లను గమనించి యజమానితో ప్లాస్టిక్ కవర్లలో పండ్లను ఉంచితే అవి త్వరగా మాగి కుళ్ళిపోవడమే కాక వ్యాధులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. ప్లాస్టిక్ సంచులు వినియోగం మరొకమారు గమనిస్తే భారీగా అపరాధ రుసుము విధించాల్సి ఉంటుందని అన్నారు. షాపుల ముందు ఉన్న వ్యర్థాలకు షాపు యజమాని బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. రోడ్డు ప్రక్కన బహిరంగ ప్రదేశాలలో ఉన్న చెత్తను గమనించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా ప్రజలకు అవగాహన కలిగించే విధంగా ఎక్కడికి అక్కడ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. నగరంలో గుర్తించిన ప్రదేశాలలో చెత్త వేయుటకు సంచులను ఏర్పాటు చేయాలని అన్నారు. పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి కి సూచించారు.



# మత్తుతో యువత భవిష్యత్ చిత్తు

### -డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం అందరి బాధ్యత

### అంగడి వీధి, కడప నందు "పోలీస్ కళా-జాగృతి బృందం" నాటక ప్రదర్శన కార్యక్రమంలో సి.కె దిన్నె సి.ఐ బాల మద్దిలేటి




**కడప జూన్ 16. నంది పత్రిక:** జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం అంగడి వీధి, కడప నందు"పోలీస్ కళా–జాగృతి బృందం" ఇన్‌చార్జ్ జి.నరసరామ్ మరియు టీమ్ చే 'ఓయువతా... మేలుకో" నాటక, పాటల ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.ఈసందర్భంగా సికె.దిన్నె సిఐ బాలమద్దిలేటి మాట్లాడుతూ నేటిసమాజంలో యువత "డ్రగ్స్"కు దూరంగా ఉండి వారి భవిష్యత్తును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మత్తుపదార్థాల వాడకంవల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు, సమాజంలోని రుగ్మతలు వాటివలన కలిగే అనర్థాల గురించి వివరించారు. అలాగే తల్లిదండ్రులు అయిన మీరు మీ పిల్లలు విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు.మత్తుపదార్థాలు వాడిన, అమ్మిన, ఆశ్రయం కల్పించిన దానికి తగిన శిక్షలు గురించి తెలియజేశారు.మత్తు పదార్థాల ఆచూకీ తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972కి కాల్ చేసి తెలియజేయాలన్నారు.అలాగే ఈగల్ టీం ఆయూబ్ ఖాన్, గురుశేఖర్ "యువతా మేలుకో–మత్తు నుండి తేరుకో, డ్రగ్స్ వద్దు– జీవితం ముద్దు, మత్తుపదార్థాలకు దూరంగా ఉందాం– భవిష్యత్తును కాపాడుకుందాం" అని నినాదాలు చేయించారు.పోలీసు కళా–జాగృతి బృందం" ప్రదర్శన ప్రజలనుఅలరించింది.ఈకార్యక్రమంలో ఫ్యాక్షన్ జోన్ యస్.ఐ సుబ్రహ్మణ్యం, బృందసభ్యులు మరియు అంగడివీధి ప్రజలు పాల్గొన్నారు.

# మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే గంగుల నాని



**ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 16 నంది పత్రిక** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి కలిశారు. మంగళవారం నాడు తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ని మాజీ ఎమ్మెల్యే గంగుల మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ,జిల్లా నియోజకవర్గ వివిధ అంశాలపై వారు ఇరువురు చర్చించారు.

# విద్యార్థులకు గుణాత్మకమైన విద్య అందించాలి

### కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా

విద్యార్థులకు గుణాత్మకమైన విద్య అందాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం రాజ్ భవన్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి అల్పాహారాన్ని పరిశీలించి, మధ్యాహ్నం భోజనం తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని పాఠశాలలో కార్పొరేట్ స్థాయికి దీటుగా మౌలిక వసతులు కల్పించటం జరిగిందని అన్నారు. అలాగే పాఠశాలల్లో విద్యార్థులకు గుణాత్మక విద్య అందాలని, విద్యార్థుల డ్రాప్ అవుట్స్ తగ్గించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. పాఠశాలలోని విద్యార్థుల యొక్క అల్పాహారం పరిశీలనతో పాటు అలాగే విద్యార్థులతో మమేకమై ముచ్చటించారు. విద్యాశాఖ అధికారులు అన్ని పాఠశాలలను నిరంతరం తనిఖీ చేయాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. విద్యార్థుల హాజరు శాతం, ఉపాధ్యాయుల యొక్క వివరాలను ఆమె తెలుసుకున్నారు. వర్షాకాలం ప్రారంభం అవటంతో విద్యార్థుల యొక్క తరగతి గదులతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ముఖ్యంగా మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. పిల్లలకు మంచి వాతావరణంలో విద్యాబోధన జరగాలని ఉపాధ్యాయులకు ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శామ్యూల్ రాజ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# హోం మంత్రి పై అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలి.. మంత్రి బీసి



**బనగానపల్లె జూన్ 16నందిపత్రిక** రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితపై వైసిపి నేత గుడివాడ అమర్నాథ్ వ్యాఖ్యలు అత్యంత అనుచితమైనవని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసి జనార్దనరెడ్డి వ్యాఖ్యలను ఖండించినట్లు మంగళవారం మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపారు. అమర్నాథ్ వ్యాఖ్యలను .వెనక్కితీసుకొని రాష్ట్ర ప్రజలకు మహిళలకు బహిరంగ చెప్పాలని,మహిళలపై వైసిపి, ఆ పార్టీ నేతలకు ఉన్న చులకన భావానికి ఈ దిగజారుడు వ్యాఖ్యలు నిదర్శనం అని, విధానపరమైన విమర్శలు పక్కన పెట్టి, ఒక మహిళా హోంమంత్రిని వ్యక్తిగతంగా దూషించడం సభ్య సమాజం ఎంత మాత్రం ఆమోదించదని అన్నారు.ఈనాడు అన్ని రంగాలలో రాణిస్తున్న మహిళలను మానసికంగా దెబ్బతీసేలా వైసిపి నేతల వ్యాఖ్యలు ఉన్నాయని పార్టీ నేతలు పదే పదే మహిళలను అవమానిస్తున్నా, వైసీపీ అధినేత వారిని మందలించకపోవడం పార్టీ అధినాయకత్వం వైఖరిని, వారి రాజకీయ సంస్కారాన్ని ప్రతిబింబిస్తోందని ప్రజల కోసం అంకితభావంతో పనిచేస్తున్న మహిళ హోంమంత్రిని వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం వైసీపీ రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనం అని గుడివాడ అమర్నాథ్ తన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకుని, హోంమంత్రికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మంత్రి అన్నట్లు అందులో పేర్కొన్నారు.

# అనుమతులు లేకుండా మరబోట్లు నడిపే సీజ్ చేస్తాం

### - ఎస్ ఐ జయశేఖర్

**కొత్తపల్లి – నంది పత్రిక :** కృష్ణానదిలో అనుమతులు లేకుండా మరబోట్లను తిప్పితే బోట్లను సీజ్చేస్తామని ఎస్ఐ జయశేఖర్ మంగళవారం రాత్రి తెలిపారు. సంగమేశ్వరం, సిద్ధేశ్వరం వద్ద ఉన్న బోటు ఘాట్ల నుంచి అటు తెలంగాణ వారు గాని, ఇటు ఆంధ్రప్రదేశ్ బోటు నిర్వహకులు గాని అనుమతులు లేకుండా బోట్లు తిప్పినా, ప్రయాణికులను చేరవేసిన బోట్లు సీజ్ చేసి నిర్వహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ, కలెక్టర్, ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిబంధనలు అమలు చేస్తున్నామన్నారు. ఎవరైనా రెండు రాష్ట్రాలకు చెందిన మరబోట్ల నిర్వహకులు నిబందనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని చెప్పారు.

# టిడిపి నాయకులు వైసిపి నేత డాక్టర్ సుదీర్ దార పై మతితప్పి మాట్లాడితే సహించేది లేదు

**టిడిపి నాయకులా ఎమ్మార్పీఎస్ నాయకులా ఏదో ఒకటి తేల్చుకొని మాట్లాడండి.**

**డాక్టర్ సుధీర్ ధారపై, టిడిపి నాయకులు, ఎంఆర్పిఎస్ నాయకుల ఆరోపణలు అవివేకమైవి.**

**టిడిపి నాయకుల, ఎమ్మార్పీఎస్ నాయకుల ఆరోపణలు ఖండించిన వైసీపీ ఎస్సీ సెల్ నియోజవర్గ ఇంచార్జ్ మార్కెట్ రాజు.**




**నందికొట్కూరు జూన్ 16( నంది పత్రిక)** వైసిపి నందికొట్కూరు నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ సుధీర్ ధారపై టీడీపీ మరియు ఎమ్మార్పీఎస్ నాయకులు చేసిన అనుచిత మరియు అసత్య ఆరోపణలను మంగళవారం పట్టణంలోని స్థానిక వైఎస్ఆర్సిపి కార్యాలయం నందు వైసిపి ఎస్సి సెల్ విభాగం నాయకులు నియోజవర్గ ఇన్చార్జి మార్కెట్ రాజ్ ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించి తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో నియోజవర్గ అధ్యక్షులు మార్కెట్ రాజు మాట్లాడుతూ తమ నాయకుడు నందికొట్కూరు వైసిపి నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ సుధీర్ ధార టిడిపి అవినీతి మయమైన పరిపాలనపై, పేదల కుటుంబాలను ఇబ్బందులకు గురిచేసి టిడిపి నాయకులు చేసిన కబ్జా అంశాలపై ప్రశ్నిస్తే సహించలేక దానికి సమాధానం చెప్పలేక తమ నాయకుని పై తిరుగుబాటు ధోరణితో టిడిపి నాయకులు అసత్య ఆరోపణలు చేస్తూ, కుల సంఘములా నాయకులతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ కించపరిచే మాటలు మాట్లాడడం వారికి తగదని హెచ్చరించారు. ప్రజా పక్షాన జరుగుతున్న అవినీతి పాలనమైన ఘటనలను ప్రజలకు వివరిస్తూ డాక్టర్ సుధీర్ ధార ప్రశ్నిస్తే అందులో తప్పేమిటని నిజాలు మాట్లాడితే టిడిపి నాయకులకు నచ్చలేక జీవించలేకపోయారన్న విషయం స్పష్టంగా కనబడు తుందన్నారు. ఎమ్మార్పీఎస్ సంఘం కుల సంక్షేమం కోసం పాటుపడాలని, అంతేకానీ రాజకీయ పార్టీ నాయకులకు తొత్తులుగా మారి తమ పార్టీ నాయకులపై ఇష్టం వచ్చినట్లు అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ సంఘంలో పనిచేస్తున్న నాయకుడిగా చలామణి అవుతు టిడిపికి తొత్తుగా మారి టిడిపి ముసుగు వేసుకొని ఎందుకు మాట్లాడతావు అంటూ, నీకు అంతగా ఉంటే టిడిపి పార్టీ కండువా వేసుకొని విమర్శలు చెయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కాటేపోగు జయన్న (జాన్ )కు సూచనలు చేస్తూ హెచ్చరిస్తున్నామన్నారు. ఏ కులం,ఏ ప్రాంతమని, మా నాయకుడి డాక్టర్ సుదీర్ దార ను ప్రశ్నించే అర్హత నీకు ఎలా ఉంది అని, రాజ్యాంగం నిర్దేశించిన నియమాలనుసారంగా ఎక్కడి నుంచైనా పోటీ చేసే హక్కు కల్పించబడిందన్న విషయం తెలియకుండా, కనీసం పరిజ్ఞానం లేకుండా ఆరోపణలు చేస్తావా అంటూ మండిపడ్డారు. నీవు చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఎమ్మార్పీఎస్ ముసుగు ధరించవే తప్ప జాతి ప్రయోజనాల కోసం కాదని, నువ్వు చేసిన తప్పులు, మోసాలు చాలా ఉన్నాయి అన్న విషయం గుర్తుంచుకోని మసులుకోవాలని హితవు పలికారు. అనంతరం ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు చరణ్ మాట్లాడుతూ తమ నాయకుడు నియోజవర్గ ఇన్చార్జ్ డాక్టర్ సుదీర్ ధారాపై టిడిపి నాయకులు పలుచాని మహేశ్వర్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు మతిలేని అవివేకమైన ఆరోపణలని వారు ఖండించారు. వైద్య వృత్తిలో రాణిస్తూ గర్వించదగిన ప్రతిభ కలిగిన వైద్యుడు డాక్టర్ సుధీర్ ధార అన్నా విషయం టిడిపి నేతలు మరియు పలుచాని మహేశ్వర్ రెడ్డి గుర్తుంచుకోవాలన్నారు. సేవ దృక్పథంతో వైద్య వృత్తిని ప్రజలకు అందిస్తుంటే మీ నాయకులా పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన ఎస్సీల భూములు కొల్లగొట్టి విల్లాలు కట్టి కోట్ల రూపాయలు దండుకున్న దుర్బుద్ధి కలిగిన నాయకులు మీ టిడిపి నేత అన్న విషయం మీకు తెలియదా అంటూ వారు మండిపడ్డారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని రైతులకు అన్యాయం చేస్తున్న విషయం చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరికీ తెలుసును అన్న విషయం మరిచిపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. నియోజవర్గ ప్రజల సంక్షేమమే సేవగా భావించే మంచి మనసున్న మా నాయకుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు సేవ చేయడానికి ముందుకొచ్చిన డాక్టర్ సుధీర్ ధారపై టిడిపి నేతలు మతిగతి తప్పి మాట్లాడితే సహించేదే లేదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ విభాగం నాయకులు పాల్గొన్నారు.

# ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ

### 2002 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ ప్రక్రియ కొనసాగుతుంది

### తాసిల్దార్ జ్యోతి రత్నకుమారి



**ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 16, నంది పత్రిక** ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఆళ్లగడ్డ తహశీల్దార్ జ్యోతి రత్నకుమారి మంగళవారం పాతకందుకూరు, చింతకొమ్మదిన్నె, చింతకుంట గ్రామాల్లో పర్యటించి, బూత్ లెవెల్ అధికారుల (బిఎల్ఓ) ద్వారా ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ చేసి, ఓటర్ల డేటా డిజిటలైజేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం తహశీల్దార్ జ్యోతి రత్నకుమారి మాట్లాడుతూ 2002 జాబితాతో ఓటర్ల మ్యాపింగ్, ఓటర్ల జాబితా పారదర్శకతలో భాగంగా ప్రస్తుత ఓట్లను 2002 నాటి ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఈ ప్రక్రియ కోసం బిఎల్ఓ లు మీ ఇంటికి వచ్చినప్పుడు, ఓటర్లు వారికి సరైన సమాచారం ఇచ్చి సహకరించాలన్నారు. అలాగే ప్రతి ఓటరు విధిగా తమ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను బిఎల్ఓ కు అందజేయాలన్నారు. కాబట్టి ప్రజలందరూ ముందుగానే తమ ఫోటోలతో సిద్ధంగా ఉండాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ఓబులేష్ ,సూపర్ వైజర్లు, బిఎల్ఓ లు తదితరులు పాల్గొన్నారు.



# కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన - నంద్యాల టెక్క మార్కెట్ యార్డ్‌లో భారీ బహిరంగ సభ:



### మంత్రి ఎన్ఎండి ఫరూక్

**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 16 ( నంది పత్రిక )** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, నంద్యాల జిల్లాలో ఘనంగా సంబరాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా రేపు, జూన్ 17న నంద్యాల టెక్క మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ తెలిపారు . ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని ఆయన పార్టీ శ్రేణులను, ప్రజలను కోరారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ భారీ బహిరంగ సభకు జరుగుతున్న ఏర్పాట్లను మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ స్వయంగా పర్యవేక్షించారు. టెక్క మార్కెట్ యార్డ్ వేదిక వద్ద జరుగుతున్న పనులను క్షుణ్ణంగా పరిశీలించి , సభకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎమ్మార్వోలు శ్రీనివాసులు, శ్రీవాణి మరియు అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు



# శ్రీరామ్ నగర్ కాలనీలో మంజూరైన సిసి రోడ్లను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

గాజులరామారం సర్కిల్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీ ఎం ఎఫ్ ఫంక్షన్ హాల్ నుండి మంజూరైన ఎనిమిది అంతర్గత సిసి రోడ్లను మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ బస్తీలో తిరుగుతూ మంజూరైన రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు కాలనీలలో తిరుగుతూ సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని, వాటిలో భాగంగా రూ.55 లక్షలతో మంజూరైన ఈ రోడ్లను పరిశీలించడం జరిగిందని, గత బిఆర్ఎస్ హయాంలో 10 సంవత్సరాలపాటు ఎక్కడ అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను ఏర్పాటు చేయలేదని, పూర్తిగా నిర్వీర్యం చేసి ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని విమర్శించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సిసి రోడ్లను మంజూరు చేయించిన మాజీ శాసనసభ్యులు శ్రీశైలం గౌడ్ కి శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు హరీష్, రాకేష్, మధు, అశ్వత్, అనురాధ, సల్మాన్, నాగరాజు, రఫీ, ఇలియాస్, దశరథ్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# రైతు సంక్షేమంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శం

**- వైసీపీ హయాంలో బకాయిలు... కూటమి హయాంలో చెల్లింపులు**
**- ధాన్యం బకాయిలుగా ఉన్న రూ.1,674 కోట్ల చెల్లింపు**
**- రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలకు రూ.7 లక్షల ఎక్స్‌గ్రేషియా**
**- మామిడి, ఉల్లి, పొగాకు, కోకో రైతులకు రూ.588 కోట్ల సహాయం**
**- 22.5 లక్షల పంపుసెట్లకు 9 గంటల ఉచిత విద్యుత్**
**- రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం**
**- సూక్ష్మసేద్యంలో దేశంలోనే నంబర్-1 ఆంధ్రప్రదేశ్**
**- వైసీపీ అబద్ధాల ప్రచారంతో రైతులను తప్పుదోవ పట్టించొద్దు**
**- రైతు వ్యతిరేక ప్రచారాలకు ప్రజలే సమాధానం చెబుతారు**
**- రైతు కష్టానికి విలువ... రైతు కుటుంబానికి భద్రత ఇదే కూటమి పాలన - మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**అమరావతి బ్యూరో, జూన్ 16: నంది పత్రిక** రాష్ట్రంలోని రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, రైతు కుటుంబాల ఆర్థిక భద్రత విషయంలో కూటమి ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతు ఆత్మహత్యల విషయంలో వైసీపీ సానుకూల పత్రికలో పనిగట్టుకుని అబద్ధాలను ప్రచురిస్తున్నారని మంత్రి మండిపడ్డారు. జూన్ 2024 నుండి ఇప్పటి వరకు 540 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్న ప్రచారం నిజం కాదని తెలిపారు. త్రిసభ్య కమిటీ విచారణ అనంతరం గత రెండేళ్ల కాలంలో 148 కేసులు మాత్రమే రైతు ఆత్మహత్యలుగా నిర్ధారణ అయినట్లు వెల్లడించారు. వ్యవసాయ కారణాల వల్ల బలవన్మరణానికి పాల్పడిన రైతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.7 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేస్తోందని తెలిపారు. ఇప్పటికే 148 కేసుల్లో 112 మంది రైతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసేందుకు బిల్లులు సమర్పించామని, మిగిలిన కేసులను కూడా త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలో మరణించిన 81 మంది రైతులకు పరిహారం నగదు ఇవ్వలేదని కూటమి ప్రభుత్వం వచ్చినాక 5.67 కోట్ల నగదును సంబంధిత రైతుల కుటుంబాలకు చెల్లించామని మంత్రి తెలిపారు. రైతుల ఆర్థిక భద్రత కోసం కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవపీఎం కిసాన్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతి అర్హత రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.20,000 ఆర్థిక సహాయం అందజేస్తున్నామని చెప్పారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.14,000, కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ ద్వారా రూ.6,000 అందజేస్తోందని వివరించారు. 202526 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని 46.86 లక్షల రైతు కుటుంబాలకు మూడు విడతలుగా మొత్తం రూ.8,985.41 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.6,560.18 కోట్లు కాగా, కేంద్ర ప్రభుత్వ వాటా రూ.2,425.23 కోట్లు అని పేర్కొన్నారు.

గత ప్రభుత్వ హయాంలో రైతులకు చెల్లించాల్సిన ధాన్యం సేకరణ బకాయిలు పెండింగ్‌లో ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1,674.47 కోట్ల పాత బకాయిలను పూర్తిగా చెల్లించి రైతులకు అండగా నిలిచిందని మంత్రి వెల్లడించారు. రైతు శ్రమ దోపిడీకి గురికాకుండా, ఆయన శ్రమ సంపదగా మారాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఏ ఒక్క రైతు కూడా నష్టపోకూడదన్న ఉద్దేశంతో ధరల స్థిరీకరణ నిధి ద్వారా విస్తృత సహాయం అందించామని తెలిపారు. గత బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయించినప్పటికీ, రైతుల ప్రయోజనాల కోసం దాదాపు రెట్టింపు స్థాయిలో రూ.588 కోట్లు ఖర్చు చేసి లక్ష మంది రైతులను ఆదుకున్నామని వివరించారు. తోతాపూరి మామిడి రైతులకు రూ.190 కోట్లు, కడప, కర్నూలు ఉల్లి రైతులకు కొనుగోలు చర్యల కోసం రూ.17.56 కోట్లు, ఉల్లి పంట నష్టపరిహారం కింద హెక్టారుకు రూ.25 వేల నుంచి రూ.50 వేలకు పెంచి రూ.128.33 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. అదేవిధంగా పొగాకు రైతులకు రూ.240 కోట్లు, కోకో రైతులకు రూ.12 కోట్లు చెల్లించి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. 202627 ఆర్థిక సంవత్సరంలో ధరల స్థిరీకరణ నిధి కింద రూ.500 కోట్లు ప్రతిపాదించామని, అవసరమైతే రైతుల కోసం అదనపు నిధులు కూడా ఖర్చు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం ద్వారా రాష్ట్రంలోని 22.5 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు రోజుకు 9 గంటలపాటు నిరంతర పగటి ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకంపై రూ.13,241.17 కోట్ల సబ్సిడీ వ్యయం జరిగినట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు 68,988 కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ఉద్యానవన రంగం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న మంత్రి, రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు లక్ష కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టును కేంద్ర సహకారం, ప్రైవేటు పెట్టుబడులతో అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. పండ్ల ఉత్పత్తిలో 15.6 శాతం వాటాతో ఆంధ్రప్రదేశ్ దేశంలో మొదటి స్థానంలో ఉందని, ఆయిల్ పామ్, బొప్పాయి, నిమ్మ, కోకో, టమోటా, కొబ్బరి ఉత్పాదకతలో దేశంలో అగ్రస్థానంలో నిలిచిందని వెల్లడించారు. మిరప ఉత్పత్తిలో రాష్ట్రం రెండో స్థానంలో ఉందన్నారు. పామాయిల్ తోటల విస్తరణకు 202627లో రూ.204 కోట్లు ప్రతిపాదించామని, పశ్చిమ గోదావరి జిల్లాను కోకో హబ్‌గా అభివృద్ధి చేసి 'కోకో సిటీ' ఏర్పాటు ద్వారా చాక్లెట్ పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వ కాలానికి సంబంధించిన రూ.1,990.10 కోట్ల ప్రీమియం సబ్సిడీ బకాయిలు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పాపం జగన్ చేసిందే. మొదటి రెండేళ్లు ఇచ్చారు అందులో 1990 కోట్లు బకాయి పెట్టారు, మిగతా మూడు ఏళ్లు ప్రీమియం కట్టలేదు. బకాయిని తిరిగి కట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సూక్ష్మసేద్యం అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత 5.5 లక్షల ఎకరాలను కొత్తగా సూక్ష్మసేద్య పరిధిలోకి తీసుకువచ్చామని మంత్రి పేర్కొన్నారు. రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, గిట్టుబాటు ధరలు, నష్టపరిహారం, విద్యుత్, సాగునీరు, మార్కెటింగ్ సదుపాయాలు వంటి అన్ని అంశాల్లో ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. అసత్య ప్రచారాలను నమ్మకుండా రైతులు వాస్తవాలను గుర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఖరీఫ్ సాగుకు అవసరమైన ఎరువుల కొరత లేదని, రైతులకు సకాలంలో ఎరువులు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని మంత్రి కింజరాపు తెలిపారు. జూన్ 8వ తేదీ నుండి జూన్ 16వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 95,506 మంది రైతులకు మొత్తం 4,77,501 ఎరువుల బస్తాలు విక్రయించినట్లు మంత్రి వెల్లడించారు. ఇందులో 3,56,916 యూరియా బస్తాలు, 1,20,585 డీఏపీ బస్తాలు రైతులకు అందించామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎరువులను అక్రమంగా అమ్ముకున్నారు, ఎరువులను రైతులకు అందచేసేందుకు ప్రత్యేక యాప్ ను తీసుకొచ్చాం, రాష్ట్రవ్యాప్తంగా సక్రమంగా ఎరువుల కొనుగోలు జరుగుతున్నాయని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.



# ఉప్పరపల్లి హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్.




**కేసముద్రం, జూన్ 16(నంది పత్రిక):**కేసముద్రం మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో సోమవారం రాత్రి కుండే నరేష్(32) హత్య కేసును కేసముద్రం పోలీసులు ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. కేసముద్రం పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో సిఐ సత్యనారాయణ, ఎస్ఐ క్రాంతి కిరణ్ తో కలిపి వివరాలు వెల్లడించారు. ఉప్పరపల్లి గ్రామంలో హత్యకు గురైన మృతుడి తండ్రి అయిలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసముద్రం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మంగళవారం కేసముద్రం సీఐ వై.సత్యనారాయణ, ఎస్సై క్రాంతి కిరణ్, సిబ్బంది కేసముద్రం గ్రామ శివారులోని కోరుకొండపల్లి క్రాస్ రోడ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, కేసుకు సంబంధించిన నిందితులు అనుమానాస్పదంగా సంచరిస్తుండటంతో కంకల కుమారస్వామి(46), కుండే అనూష (29), కంకల కలమ్మ (40) లను అదుపులోకి తీసుకుని విచారించగా కుటుంబ కలహాలు, మృతుడి మద్యపానం, భార్యపై తరచూ శారీరక, మానసిక వేధింపులు, ఇతర మహిళలతో సంబంధాలపై వివాదాల కారణంగా గత కొంతకాలంగా కుటుంబంలో తీవ్ర విభేదాలు కొనసాగుతున్నాయని, కుటుంబ వివాదం నేపథ్యంలో సోమవారం పోలీస్ స్టేషన్లో కౌన్సిలింగ్ అనంతరం ఇంటికి వెళ్తున్న సమయంలో కూడా మృతుడు నిందితులతో గొడవపడగా, ముందస్తు పథకం ప్రకారం ఇనుప రాడ్డుతో సోమవారం రాత్రి మృతుడు ఇంటి వద్దకు వచ్చి గొడవ సృష్టించిన సమయంలో అతడిని ఇనుప రాడ్డుతో తలపై పలుమార్లు కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు నిందితులు విచారణలో ఒప్పుకున్నట్లు సిఐ తెలిపారు. హత్యకు ఉపయోగించిన ఇనుప రాడ్డు, పరారయ్యేందుకు ఉపయోగించిన మోటార్ వెహికిల్ ను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేసి, కోర్టులో రిమాండ్ నిమిత్తం హాజరుపరిచినట్లు తెలిపారు.

# తాటిచెట్టుపై నుండి పడి గీత కార్మికుడు మృతి.

**కేసముద్రం, జూన్ 16(నంది పత్రిక):** తాటి చెట్టు పై నుండి పడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలోని కల్వల గ్రామంలో చోటు చేసుకుంది. కల్వల గ్రామానికి చెందిన వేముల చిన్న మల్లేశం(65) మంగళవారం ఉదయం కళ్ళు గీయడం కోసం గ్రామ శివారులోని మెరుగు సాయిలు చేలక వద్ద గల తాటిచెట్టు ఎక్కి కళ్ళు గీయిచుండగా ప్రమాదవశాత్తు కాలుజారి తాడిచెట్టు పైన నుండి కింద పడి చనిపోయాడు. మృతుడి కుమారుడు వేముల శ్రీనివాస్ ఇచ్చిన దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



# గూటుపల్లి భూముల సమస్య పరిష్కారానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి వివరించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, జూన్ 16(నంది పత్రిక):-** రాష్ట్రంలో రెవెన్యూ సంబంధిత అంశాల పరిష్కారం, ప్రస్తుత సీజనల్ పరిస్థితుల నిర్వహణ, వ్యవసాయం మరియు అనుబంధ శాఖల సంసిద్ధతతో పాటు నీట్ పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లను సూచించారు. మంగళవారం అమరావతి సచివాలయం నుండి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీఎస్‌సీఎల్‌ఏ, వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఉన్నతాధికారులు, కళాశాల విద్యాశాఖ డైరెక్టర్ సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్ఓ రాము నాయక్‌తో పాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం గూటుపల్లి గ్రామానికి సంబంధించిన భూముల సమస్యను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. గూటుపల్లి గ్రామంలోని భూములన్నీ వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో 'వక్ఫ్ బోర్డు భూములు' మరియు 'ఎండోమెంట్ భూములు'గా నమోదై ఉండటంతో గ్రామ ప్రజలు వివిధ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. గ్రామం మొత్తం ఈ విధంగా నమోదుకావడం వల్ల భూ లావాదేవీలు, హక్కుల నిర్ధారణ తదితర అంశాల్లో సమస్యలు తలెత్తుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా సంబంధిత రికార్డులను పరిశీలించి, అవసరమైన సవరణలు చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి వివరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గూటుపల్లి గ్రామ భూముల అంశాన్ని సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకునే దిశగా ముందుకు సాగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంతకుముందు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ, వ్యవసాయ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ అంశాల పురోగతి, భూ సంబంధిత సమస్యల పరిష్కారం, ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, మత్స్యశాఖల సంసిద్ధతను పరిశీలించి అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే నీట్ పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా పరీక్షా కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.




# గుడివాడ అమర్నాథ్ నోరు అదుపులో పెట్టుకో.. మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదు.

## ప్రసన్నలక్ష్మి. టిడిపి జిల్లా ఉపాధ్యక్షురాలు.

**నందికొట్కూరు జూన్16( నంది పత్రిక)** వైసిపి నేత మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడకపోతే సహించేది లేదని తగిన రీతిలో మహిళా లోకం బుద్ధి చెబుతుందని తక్షణమే హోంమంత్రి అనితమ్మ కు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని టిడిపి జిల్లా ఉపాధ్యక్షురాలు ప్రసన్న లక్ష్మి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోనే స్థానిక టిడిపి కార్యాలయం నందు టిడిపి జిల్లా ఉపాధ్యక్షురాలు ప్రసన్న లక్ష్మీ ఆధ్వర్యంలో వైసీపీ నేత మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ హోమ్ మంత్రి అనిత పై చేసిన అనుచిత వ్యాఖ్యలను పాత్రికేయుల సమావేశంలో టిడిపి మహిళలు తీవ్రస్థాయిలో ఖండించారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షురాలు ప్రసన్న లక్ష్మీ మాట్లాడుతూ మహిళలను గౌరవించే సంస్కృతి లేదనడానికి గౌరవప్రదమైన స్థానంలో వున్నా హోంమంత్రి అనిత పై వైసిపి నేత మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలే అందుకు నిదర్శనం అన్నారు. మోసపూరితమైన, దౌర్జన్యపరమైన పాలన చేయడం వల్లే గత ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పడంతో 11 సీట్లకే పరిమితమైన విషయాన్ని మైమర్చి నేడు మహిళలపై అసభ్యకరంగా మాట్లాడడం వైసీపీ నాయకులకే చెల్లుబాటు అవుతుందని ప్రజల గమనిస్తున్నారు అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఉపాధ్యాయురాలుగా ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్ది , ఎంతో ప్రతిభ సమాజ సేవ తత్వం కలిగిన వంగలపూడి అనిత పై ఎంతో నమ్మకంతో గౌరప్రదమైన స్థానంలో మహిళలను గౌరవిస్తూ తమ అధినేత నారా చంద్రబాబునాయుడు హోంమంత్రి స్థానంలో నిలబెట్టారని అది తమ పార్టీలో మహిళలకు దక్కే గౌరవం అన్నారు. అలాంటి గౌరవప్రదమైన స్థానంలో ఉన్న మహిళ హోంమంత్రి అనిత అని ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. తక్షణమే హోం మంత్రి అనితమ్మకు మరియు మహిళా లోకానికి తక్షణమే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. అనంతరం గుడివాడ అమర్నాథ్ చిత్రపటానికి కోడిగుడ్లు కొడుతూ వైసీపీ నేత గుడివాడ అమర్నాథ్ వైఖరి నశించాలని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షురాలు డాక్టర్ మీనాక్షి, డాక్టర్ వనజ, మరియు టీడీపీ మహిళలు పాల్గొన్నారు.



# జిల్లాలో పర్యాటక అభివృద్ధి పనుల పరిశీలన - వాణి ప్రసాద్

యాదాద్రి భువనగిరి జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి చేపడుతున్న వివిధ ప్రాజెక్టుల పురోగతిని తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ముందుగా యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలోని రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న హరిత హోటల్‌లో ఆధునీకరణ పనులను ఆమె పరిశీలించారు. సందర్శకులకు మెరుగైన వసతులు కల్పించే దిశగా చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని ప్రసిద్ధ సోమేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి, ఆ ప్రాంతంలో పర్యాటక రంగ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై , ఆలయానికి వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, పర్యాటక ఆకర్షణగా మరింత అభివృద్ధి చేసే అవకాశాలపై చర్చించారు. తదుపరి బస్వాపూర్ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి పరిశీలించారు. ప్రకృతి అందాలను వినియోగించుకుని పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అలాగే భువనగిరి కోట వద్ద ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న రోప్‌వే ప్రాజెక్టు పనులను పరిశీలించి, పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టును నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ పర్యటనలో పర్యాటక శాఖ డైరెక్టర్ రంజిత్ నాయక్, ఆర్కియాలజీ డైరెక్టర్ అర్జున్ రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత తహసీల్దార్లు,

# హై డెన్సిటీ ప్లాంటేషన్‌తో పచ్చదనానికి ప్రాధాన్యం ఇవ్వాలి



## ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలను మోడల్ గ్రీన్ క్యాంపస్‌లుగా తీర్చిదిద్దాలి

## జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

**నంద్యాల బ్యూరో, జూన్ 16(నంది పత్రిక):-** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో హై డెన్సిటీ ప్లాంటేషన్‌ను విస్తృతంగా చేపట్టి పచ్చదనం పెంపొందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో హై డెన్సిటీ ప్లాంటేషన్ కార్యక్రమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ సూర్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చింతామణి, డీఈఓ జనార్ధన్ రెడ్డి, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రతినిధులు శర్వానన్ సుబ్రమణ్యం, జయసూర్య, ఆశ్రిత, అంకిత కుమారి, రాజశేఖర్, శరత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు మరియు వసతి గృహాల ప్రాంగణాల్లో హై డెన్సిటీ ప్లాంటేషన్ ద్వారా పర్యావరణహిత వాతావరణాన్ని సృష్టించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ఒక పాఠశాలను ఎంపిక చేసి సోక్ పిట్స్, వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలు, వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, సోలార్ సదుపాయాలు తదితర అంశాలను సమగ్రంగా ఏర్పాటు చేసి దానిని ఆదర్శ గ్రీన్ మోడల్ పాఠశాలగా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా రాతినేలలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో కూడా హై డెన్సిటీ ప్లాంటేషన్ విజయవంతంగా అమలు చేయడానికి అనువైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, అందుకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రతినిధులను కోరారు. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రతినిధి శర్వానన్ సుబ్రమణ్యం మాట్లాడుతూ, వర్షాకాలంలో లభించే నీటిని సమర్థవంతంగా నిల్వ చేసుకోవడం అత్యంత అవసరమన్నారు. నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ, వర్షపు నీటి నిర్వహణ కార్యక్రమాలను విస్తృత స్థాయిలో అమలు చేయడం ద్వారా జిల్లాలో పచ్చదనం గణనీయంగా పెరిగే అవకాశముందని పేర్కొన్నారు.



# యర్రగుంట్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలలో విజేత నంద్యాల డాక్టర్ సంజీవ టీం



**శిరివెళ్ల:(నంది పత్రిక);** సిరివెళ్ల మండల పరిధిలోని యర్రగుంట్ల మేజర్ పంచాయతీ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన యర్రగుంట్ల ప్రీమియర్ లీగ్ టెన్నిస్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ పోటీలు మంగళవారం హోరా హోరీగా సాగాయి. ఈ పోటీలలో మొదటి బహుమతి గెలుపొందిన డాక్టర్ సంజీవ టీంకు రూ. 30,000, అందుకుంది. రెండవ బహుమతి యర్రగుంట్ల టీం 20,000 బహుమతి, మూడవ టీం 10,000, ఆళ్లగడ్డ టీం, నాలుగవ బహుమతి సాంబవలం టీం గెలుపొందాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న తుమ్మల నవకాంత్, తపస్సి రమేష్, తపస్సి రామయ్య, మద్ది సురేష్, వ్యాపారాల గురు ప్రసాద్, కమతం సుదర్శన్ రెడ్డి, కొల్లి గోపాల్, యాపరాల మల్లేష్ బాబు, ముక్కల నితీష్, యాపరాల చిన్న మద్దిలేటి విజేతలకు బహుమతులు అందజేశారనీ నిర్వాహకులు తెలియజేశారు.

# పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాల అమలులో తిరుపతి జిల్లా ముందంజ

## ఎస్ ఏ ఎస్ ఏ లక్ష్యాలను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలిలి

## మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలి

## జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



**తిరుపతి, బ్యూరో చీఫ్ జూన్ 16: నంది పత్రిక** ఎస్ ఏ ఎస్ ఏ లక్ష్యాలను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పారిశుధ్యం మరియు వ్యర్థాల నిర్వహణ కార్యాచరణ అంశాల అమలుపై తిరుపతి మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ శారదా దేవి,జిల్లా పంచాయతీ అధికారిణి సుశీల దేవి, తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్ లతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఎస్ ఏ ఎస్ ఏ పరిధిలో చేపట్టిన అన్ని కార్యక్రమాలను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న పారిశుధ్య, వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాల పురోగతిని సమీక్షిస్తూ ఆయన పలు సూచనలు చేశారు. తిరుపతి జిల్లాలోని 807 గ్రామ పంచాయతీల్లో ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగుతోందని, 654 ఘన వ్యర్థాల శుద్ధి కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని తెలిపారు. సేకరించిన తడి వ్యర్థాలతో వర్మీ కంపోస్ట్ తయారీ చేపట్టి ఇప్పటివరకు 78 టన్నుల వర్మీ కంపోస్ట్ విక్రయం ద్వారా రూ.6 లక్షల ఆదాయం సమకూరిందన్నారు. ఈ ఆదాయాన్ని గ్రీన్ అంబాసిడర్లకు అందజేస్తున్న పైలట్ కార్యక్రమం మంచి ఫలితాలను ఇస్తోందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్ల( పిడబ్ల్యూఎం యు) ఏర్పాటులో జిల్లాకు మంజూరైన 10 యూనిట్లలో 8 యూనిట్లు ఇప్పటికే సరఫరా అయ్యాయని, మిగిలిన రెండు యూనిట్లు త్వరలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అన్ని యూనిట్లను ఈ నెలాఖరులోగా పూర్తిస్థాయిలో కార్యాచరణలోకి తీసుకురావాలని ఆయన ఆదేశించారు. స్వచ్ఛ పథం కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల శుభ్రతకు విశేష ప్రాధాన్యత ఇస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు ఆరు విడతల్లో 4,143.38 కిలోమీటర్ల మేర రహదారులను శుభ్రపరచి, 3,795.67 టన్నుల రోడ్డు పక్క వ్యర్థాలను తొలగించినట్లు వెల్లడించారు. కార్యక్రమాన్ని పి ఆర్ వన్- యాప్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. గ్రీన్ షాపుల నిర్వహణలో భాగంగా తిరుపతి రూరల్ మండలంలోని చెర్లోపల్లి గ్రామ పంచాయతీ, చంద్రగిరి గ్రామ పంచాయతీలలో పైలట్ ప్రాతిపదికన రెండు గ్రీన్ షాపులు ప్రారంభించామని తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా పునర్వినియోగానికి అనుకూలమైన పొడి వ్యర్థాల సేకరణ, మార్పిడి ప్రక్రియ సమర్థవంతంగా జరుగుతోందన్నారు. అదేవిధంగా గోబర్ధన్ ప్రాజెక్టులు, కమ్యూనిటీ సోక్ పిట్స్, కంపోస్ట్ పిట్స్, కిచెన్ గార్డెన్లు, మ్యాజిక్ డ్రెయిన్లు, ఎఫ్ ఎస్ టి పి, ఐ ఎస్ డబ్ల్యూ ఎం ,ఎస్ టి పి ప్లాంట్ల నిర్మాణ పనులు, మంజూరైన యంత్రాలు, వాహనాల సేకరణ, గ్రీన్ షాపులు, నెట్-జీరో హాస్టళ్లు, కొత్త మరుగుదొడ్ల అవసరాల సర్వే, బల్క్ వేస్ట్ జనరేటర్ల ఏర్పాటు వంటి అన్ని ప్రాధాన్యత అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అన్ని మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని కార్యక్రమాలపై లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన పురోగతి, పెండింగ్ పనులు, పూర్తి చేయవలసిన అంచనా తేదీలతో కూడిన నవీకరిత స్థితి నివేదికలను వెంటనే సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ మరియు వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో మరింత సమర్థవంతంగా అమలు చేసి రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పుత్తూరు, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట, శ్రీ కాళహస్తి మున్సిపల్ కమిషనర్లు డివి నాగేశ్వరరావు, కిరణ్, ఫజులుల్లా, చిన్నయ్య, కృష్ణారెడ్డి, తుడా చీఫ్ ప్లానింగ్ అధికారిణి దేవి కుమారి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు పార్వతిప్రియ, మూర్తి, తుడా ఏసి శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా "రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం



**నంద్యాల బ్యూరో, జూన్ 16(నంది పత్రిక):-** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్వహించనున్న జిల్లా స్థాయి కార్యక్రమానికి సంబంధించి మంగళవారం నంద్యాల పట్టణంలోని టెక్కే మార్కెట్ యార్డులో ఏర్పాట్లను మంత్రి, కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ప్రధాన వేదిక, ఎగ్జిబిషన్ స్టాళ్లు, పార్కింగ్ ప్రదేశాలు, పందిళు్ల, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సదుపాయాలు తదితర ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ విజయాలను ప్రజలకు చేరవేసే వేదికగా ఈ కార్యక్రమం నిలవనున్నందున అన్ని ఏర్పాట్లు అత్యున్నత ప్రమాణాలతో ఉండాలని సూచించారు. కార్యక్రమానికి సుమారు ఐదు వేల మంది ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న శాఖల స్టాళ్లు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రభావాన్ని, అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలను స్పష్టంగా ప్రతిబింబించేలా ఉండాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. మొత్తం 19 శాఖలు తమ తమ విభాగాల సేవలు, విజయాలు, వినూత్న కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పంచాయతీరాజ్, ఆర్టీసీ, డీఆర్‌డీఏ, వ్యవసాయ, మెప్మా, పశుసంవర్ధక, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్, పర్యాటక, ఆర్‌డబ్ల్యూఎస్, శానిటేషన్, పోలీసు, మత్స్యశాఖలతో పాటు ఇతర విభాగాలు కూడా తమ శాఖల పనితీరును ప్రజలకు చేరవేసేలా ఆకర్షణీయమైన స్టాళ్లను సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. అంతకుముందు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ కార్యక్రమ స్థలాన్ని సందర్శించి ఏర్పాట్ల పురోగతిని సమీక్షించారు. నిర్ణీత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# మహిళల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు సహించం.

## గుడివాడ అమర్నాథ్ వ్యాఖ్యలను ఖండిస్తూ

## నంద్యాలలో తెలుగు మహిళల భారీ నిరసన





**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 16 ( నంది పత్రిక )** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం మంత్రి శ్రీమతి వంగలపూడి అనిత గారిపై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన అనుచిత, అవమానకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ తెలుగు మహిళ విభాగం ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ సర్కిల్ వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు మహిళ నాయకులు గుడివాడ అమర్నాథ్ చిత్రపటానికి కోడిగుడ్లు, టమాటాలు విసురుతూ నిరసన వ్యక్తం చేశారు. మహిళలను అవమానించే విధంగా మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, ప్రజా జీవితంలో ఉన్న నాయకులు హుందాగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.ఎం.డి. ఫిరోజ్ మాట్లాడుతూ, మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని అన్నారు. గుడివాడ అమర్నాథ్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని రాష్ట్ర మహిళా లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుండగా, మహిళలను కించపరిచే వ్యాఖ్యలు చేయడం వైసీపీ నాయకుల మహిళా వ్యతిరేక వైఖరికి నిదర్శనమని విమర్శించారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే రాజకీయ సంస్కృతిని ప్రజలు ఎప్పటికీ అంగీకరించరని, మహిళల హక్కులు మరియు ఆత్మగౌరవ పరిరక్షణ కోసం తెలుగుదేశం పార్టీ నిరంతరం పోరాడుతుందని ఎన్ఎండి ఫిరోజ్ గారు స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలుగు మహిళ నాయకులు నసీరా, పద్మావతి, ఝాన్సీ, పావని, లక్ష్మి, భారతి రెడ్డి, సౌభాగ్యతో పాటు పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.





# పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాల అమలులో తిరుపతి జిల్లా ముందంజ

## ఎస్ ఏ ఎస్ ఏ లక్ష్యాలను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలి

## మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలి

## జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

**తిరుపతి, బ్యూరో చీఫ్ జూన్ 16: నంది పత్రిక** ఎస్ ఏ ఎస్ ఏ లక్ష్యాలను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పారిశుధ్యం మరియు వ్యర్థాల నిర్వహణ కార్యాచరణ అంశాల అమలుపై తిరుపతి మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ శారదా దేవి,జిల్లా పంచాయతీ అధికారిణి సుశీల దేవి, తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్ లతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఎస్ ఏ ఎస్ ఏ పరిధిలో చేపట్టిన అన్ని కార్యక్రమాలను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న పారిశుధ్య, వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాల పురోగతిని సమీక్షిస్తూ ఆయన పలు సూచనలు చేశారు. తిరుపతి జిల్లాలోని 807 గ్రామ పంచాయతీల్లో ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగుతోందని, 654 ఘన వ్యర్థాల శుద్ధి కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని తెలిపారు. సేకరించిన తడి వ్యర్థాలతో వర్మీ కంపోస్ట్ తయారీ చేపట్టి ఇప్పటివరకు 78 టన్నుల వర్మీ కంపోస్ట్ విక్రయం ద్వారా రూ.6 లక్షల ఆదాయం సమకూరిందన్నారు. ఈ ఆదాయాన్ని గ్రీన్ అంబాసిడర్లకు అందజేస్తున్న పైలట్ కార్యక్రమం మంచి ఫలితాలను ఇస్తోందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్ల( పిడబ్ల్యూఎం యు) ఏర్పాటులో జిల్లాకు మంజూరైన 10 యూనిట్లలో 8 యూనిట్లు ఇప్పటికే సరఫరా అయ్యాయని, మిగిలిన రెండు యూనిట్లు త్వరలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అన్ని యూనిట్లను ఈ నెలాఖరులోగా పూర్తిస్థాయిలో కార్యాచరణలోకి తీసుకురావాలని ఆయన ఆదేశించారు. స్వచ్ఛ పథం కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల శుభ్రతకు విశేష ప్రాధాన్యత ఇస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు ఆరు విడతల్లో 4,143.38 కిలోమీటర్ల మేర రహదారులను శుభ్రపరచి, 3,795.67 టన్నుల రోడ్డు పక్క వ్యర్థాలను తొలగించినట్లు వెల్లడించారు. కార్యక్రమాన్ని పి ఆర్ వన్- యాప్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. గ్రీన్ షాపుల నిర్వహణలో భాగంగా తిరుపతి రూరల్ మండలంలోని చెర్లోపల్లి గ్రామ పంచాయతీ, చంద్రగిరి గ్రామ పంచాయతీలలో పైలట్ ప్రాతిపదికన రెండు గ్రీన్ షాపులు ప్రారంభించామని తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా పునర్వినియోగానికి అనుకూలమైన పొడి వ్యర్థాల సేకరణ, మార్పిడి ప్రక్రియ సమర్థవంతంగా జరుగుతోందన్నారు. అదేవిధంగా గోబర్ధన్ ప్రాజెక్టులు, కమ్యూనిటీ సోక్ పిట్స్, కంపోస్ట్ పిట్స్, కిచెన్ గార్డెన్లు, మ్యాజిక్ డ్రెయిన్లు, ఎఫ్ ఎస్ టి పి, ఐ ఎస్ డబ్ల్యూ ఎం ,ఎస్ టి పి ప్లాంట్ల నిర్మాణ పనులు, మంజూరైన యంత్రాలు, వాహనాల సేకరణ, గ్రీన్ షాపులు, నెట్-జీరో హాస్టళ్లు, కొత్త మరుగుదొడ్ల అవసరాల సర్వే, బల్క్ వేస్ట్ జనరేటర్ల ఏర్పాటు వంటి అన్ని ప్రాధాన్యత అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అన్ని మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని కార్యక్రమాలపై లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన పురోగతి, పెండింగ్ పనులు, పూర్తి చేయవలసిన అంచనా తేదీలతో కూడిన నవీకరిత స్థితి నివేదికలను వెంటనే సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ మరియు వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో మరింత సమర్థవంతంగా అమలు చేసి రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పుత్తూరు, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట, శ్రీ కాళహస్తి మున్సిపల్ కమిషనర్లు డివి నాగేశ్వరరావు, కిరణ్, ఫజులుల్లా, చిన్నయ్య, కృష్ణారెడ్డి, తుడా చీఫ్ ప్లానింగ్ అధికారిణి దేవి కుమారి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు పార్వతిప్రియ, మూర్తి, తుడా ఏసి శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.





నంది



# రెండో భద్రాచలం వెలవెలబోతోందా?







## శిథిలావస్థలో పేరుమాండ్ల సంకీస శ్రీ రామచంద్రస్వామి దేవాలయం. పునరుద్ధరణ కోసం భక్తుల వేడుకోలు.. అభివృద్ధికి కృషి చేస్తానంటున్న సర్పంచ్ మధు.

చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాదు, మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు. అలాంటి ఓ చారిత్రక వైభవానికి నిలువెత్తు నిదర్శనమైన డోర్నకల్ మండలం పేరుమాండ్ల సంకీస గ్రామంలోని శ్రీ వైష్ణవాలయ (వైగన స ఆగమనం )శ్రీ రామచంద్రస్వామి దేవస్థానం ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురై శిథిలావస్థకు చేరుకుంది.స్థానికుల కథనం ప్రకారం, కాకతీయుల కాలంలో నిర్మితమైన ఈ దేవాలయం మహబూబాబాద్ జిల్లాలో "రెండో భద్రాచలం"గా ప్రసిద్ధి చెందింది. ఒకప్పుడు వేలాది మంది భక్తులతో కళకళలాడిన ఈ క్షేత్రంలో శ్రీరామనవమి వేడుకలు, జాతరలు ఘనంగా జరిగేవి. గ్రామ వీధులు శ్రీరామ నామస్మరణతో మారుమోగేవి. భక్తుల రద్దీతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనేది. కాలక్రమేణా ఆలయ నిర్వహణపై నిర్లక్ష్యం పెరగడంతో దేవాలయం శిథిలావస్థకు చేరుకుంది. ఒకప్పుడు భక్తుల పాలిట కొంగుబంగారంగా వెలిగిన ఈ క్షేత్రం నేడు వెలవెలబోతుండటంతో స్థానిక హిందూ భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ గోపురం, ప్రాకారాలు శిథిలమైపోతుండటం చూసి గ్రామస్థులు బాధపడుతున్నారు.దేవాలయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న బ్రాహ్మణ కుటుంబాలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. జీవనోపాధి కరువై కొందరు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు చెబుతున్నారు.ఇదిలా ఉండగా, గ్రామ సర్పంచ్ మధు దేవాలయ పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామాభివృద్ధిలో భాగంగా దేవాలయాలకు ప్రాధాన్యత ఇస్తూ పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల సహకారంతో పాటు ప్రభుత్వం, ఎండోమెంట్స్ శాఖ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి ఆలయ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన ఈ దేవాలయాన్ని పరిరక్షించి పునరుద్ధరించాలని భక్తులు, గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. లేకపోతే భవిష్యత్తులో ఈ చారిత్రక కట్టడం ఆనవాళ్లు మాత్రమే మిగిలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# డ్రాగ్‌లైన్ దొంగతనం కేసులో అమాయక కాంట్రాక్టర్ బలిపశువు

## -విలేకరుల సమావేశంలో తన గోడు వెళ్ళబోసుకున్న బాధిత కాంట్రాక్టర్

పనిమంతుడు పందిరి వేస్తే కుక్క తోక తగిలి కూలిపోయిందన్న చందంగా మారింది సింగరేణి అధికారుల పరిస్థితి. అధికారుల తప్పిదాలను, భద్రతా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు దొంగతనం కేసును అమాయకపు కాంట్రాక్టర్ పై మోపి చేతులు దులుపుకొని అన్యాయానికి పాల్పడ్డారు. అధికారుల వైఖరి కారణంగా ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా, పరువు సైతం మంట గలసి మానసిక వేదనకు గురవుతున్న బాధిత కాంట్రాక్టర్ నాగండ్ల రవి కుమార్ మంగళవారం రామగిరి మండలం సెంటినరీ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. తనకు గల శ్రీజా ఇన్ఫ్రా సెక్యూరిటీ ఫోర్స్ ద్వారా సింగరేణిలో కాంట్రాక్టు పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తనకు గలకాంట్రాక్ట్ ముగిసిన తర్వాత ఓసిపి 1 లోని డ్రాగ్ లైన్ వద్ద చోరీ చోటు చేసుకుంది. అయితే అప్పటికే తన కాంట్రాక్టు ముగిసిపోయింది. అయినా సింగరేణి అధికారులు ఈ చోరీకి తనని బాధ్యుణ్ణి చేస్తూ రూ.16 లక్షల రికవరీ కోసం నోటీసులు జారీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారుల భద్రతా వైఫల్యాన్ని కప్పిపుచ్చేందుకే తనపై చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో రూ.1 లక్ష నష్టం వాటిల్లినట్టు నమోదు చేసి తన వద్ద నుండి ఎందుకు రూ.16 లక్షలు రికవరీ చేయాలో అధికారులు సమాధానం చెప్పాలన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు డ్రాగ్‌లైన్ స్క్రాప్ చోరీ కేసులో నిష్పక్షపాత విచారణ చేపట్టాలని ఆయన కోరారు. సింగరేణి సంస్థ ఆర్జీ 3 ఏరియా సెక్యూరిటీ అధికారుల నిర్లక్ష్యం వల్ల జరిగిన డ్రాగ్‌లైన్ స్క్రాప్ దొంగతనం కేసులో తన నష్టపరిహారం మోపే ప్రయత్నం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో సింగరేణి సీఎండీ, విజిలెన్స్ అధికారులు జోక్యం చేసుకుని నిష్పక్షపాత విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు. శ్రీజ ఇన్ఫ్రా సెక్యూరిటీ కాంట్రాక్ట్ 02-03-2023న ప్రారంభమై 15-04-2026న ముగిసింది. కాంట్రాక్ట్ ముగిసినట్లు ఏరియా సెక్యూరిటీ కార్యాలయం అధికారికంగా లేఖ కూడా జారీ చేసింది. అయితే కాంట్రాక్ట్ ముగిసిన ఆరు రోజుల తర్వాత అంటే 21-04-2026న జరిగిన డ్రాగ్‌లైన్ స్క్రాప్ దొంగతనానికి తనను బాధ్యుడిగా చూపిస్తూ రూ.16 లక్షల నష్టం భరించాలని లేఖ పంపడం పూర్తిగా అన్యాయమని పేర్కొన్నారు. దొంగతనం కేసులో పేర్లు వచ్చిన సెక్యూరిటీ గార్డులు శ్రీజ ఇన్ఫ్రా నియమించుకున్న సిబ్బంది కాదని, వారు గత ఆరు సంవత్సరాలుగా ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న వారేనని తెలిపారు. సంఘటన జరిగిన సమయంలో మరో కాంట్రాక్టర్ పరిధిలో భద్రతా బాధ్యతలు ఉన్నప్పటికీ తమపై కేసు మోపడం కక్షపూరిత చర్యగా కనిపిస్తోందన్నారు. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో



దొంగిలించబడిన స్క్రాప్ విలువ సుమారు రూ.1 లక్షగా పేర్కొన్నప్పటికీ, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ మాత్రం ఎటువంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా రూ.16 లక్షల రికవరీ విధించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా తన వివరణ తీసుకోకుండా ఎటువంటి విచారణ లేకుండానే భారీ మొత్తాన్ని రికవరీ చేయాలని నిర్ణయించడం వెనుక కక్షపూరిత ధోరణి కనిపిస్తోందని ఆరోపించారు. ఏరియా సెక్యూరిటీ అధికారుల భద్రతా వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఒక తనను బలిపశువుగా మార్చే ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సింగరేణి సీఎండీ, విజిలెన్స్ అధికారులు తక్షణమే స్పందించి పూర్తి స్థాయి విచారణ జరిపించాలని, నిజమైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, తనపై విధించిన రూ.16 లక్షల రికవరీ ఉత్తర్వులను రద్దు చేసి న్యాయం చేయాలని ఆయన కోరారు.

# జాతీయ క్రీడా పరిపాలన చట్టం 2025పై అవగాహన సదస్సు నిర్వహించిన తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ

- జాతీయ క్రీడా పరిపాలన చట్టం2025 పై క్రీడా రంగానికి చెందిన వివిధ వర్గాల్లో అవగాహన పెంపొందించేందుకు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ మంగళవారం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. క్రీడా పరిపాలకులు, అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, క్రీడా రంగానికి చెందిన ఇతర భాగస్వాములకు జాతీయ క్రీడా పరిపాలన చట్టం2025లోని ముఖ్య నిబంధనలు, లక్ష్యాలు, అమలు విధానంపై సమగ్ర అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిర్వహించారు.ప్రపంచ అథ్లెటిక్స్ క్రమశిక్షణ, అప్పీళ్ల ప్యానెల్ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది పార్థ్ గోస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని కీలక ప్రసంగం చేశారు. జాతీయ క్రీడా పరిపాలన చట్టం క్రీడా సంస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం, సుస్థిర పరిపాలనకు ఎలా దోహదపడుతుందో వివరించారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ కె.శివసేన రెడ్డి మార్గదర్శకత్వంలో, వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సోనిబాలా దేవి, ఐఎఫ్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ క్రీడా సలహాదారు ఎ.పీ.జితేందర్ రెడ్డి, మాజీ కేంద్ర మంత్రివర్యులు డాక్టర్ ఎస్.వేణుగోపాలాచారి తదితరులు హాజరయ్యారు. జాతీయ క్రీడా పరిపాలన చట్టం2025 ద్వారా ప్రవేశపెట్టిన పరిపాలనా సంస్కరణలు, పారదర్శకత, జవాబుదారీతనం, క్రీడాకారుల సంక్షేమం, ఉత్తమ పరిపాలనా విధానాలపై కార్యక్రమంలో విస్తృతంగా చర్చించారు. క్రీడా సంఘాల ప్రతినిధులు, పరిపాలకులు, కోచ్‌లు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా క్రీడా పరిపాలనను మరింత బలోపేతం చేయడానికి ఉద్దేశించిన ఈ కొత్త చట్టంపై అవగాహన పెంపొందించుకోవడానికి సంబంధిత వర్గాలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ తెలిపింది. క్రీడా పరిపాలనలో మంచి పాలన, వృత్తిపరమైన ప్రమాణాలు, ఉత్తమతను ప్రోత్సహిస్తూ క్రీడాకారుల కేంద్రంగా బలమైన క్రీడా వ్యవస్థను నిర్మించాలనే తెలంగాణ ప్రభుత్వ దృష్టికోణానికి ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అధికారులు ఒలంపిక్ అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## 'డార్క్ ఫ్లీట్' నౌకల్లో కొత్త ప్రమాదం.. బయటపెట్టిన యూఎస్ కోస్ట్ గార్డ్

సముద్రంలో అక్రమంగా సంచరిస్తున్న 'ఘోస్ట్ షిప్స్' లేదా 'డార్క్ ఫ్లీట్' నౌకల ద్వారా సరికొత్త ముప్పు పొంచి ఉందని అమెరికా కోస్ట్ గార్డ్ సంచలన విషయాలను వెల్లడించింది. పాతబడిన ఈ నౌకల వల్ల భౌతిక ప్రమాదాలు తలెత్తుతాయని ఇప్పటికే తెలిసినప్పటికీ, తాజాగా వీటిలో తీవ్రమైన సైబర్ లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఇవి సముద్రంలో భారీ పేలుళ్లు లేదా చమురు లీకేజీల వంటి పెను విపత్తులకు దారితీయవచ్చని అధికారులు హెచ్చరించారు.వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం, ఇటీవల యూఎస్ కోస్ట్ గార్డ్ సైబర్ బృందాలు కొన్ని అక్రమ నౌకలో తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా వాటిలో రిమోట్ యాక్సెస్ టూల్స్, మాల్‌వేర్‌తో కూడిన పైరేటెడ్ సాఫ్ట్‌వేర్, వ్యవస్థలను రిమోట్‌గా హైజాక్ చేసేందుకు వీలు కల్పించే సాంకేతిక లోపాలను గుర్తించారు. పాశ్చాత్య దేశాల ఆంక్షల నుంచి తప్పించుకోవడానికి రష్యా, ఇరాన్, వెనిజులా వంటి దేశాల నుంచి చమురు రవాణా చేసే ఈ నౌకలను 'డార్క్ ఫ్లీట్'గా వ్యవహరిస్తారు. ఇవి తరచూ తమ ట్రాకింగ్ వ్యవస్థలను ఆపివేసి, నకిలీ గుర్తింపులతో సముద్ర ప్రయాణాలు సాగిస్తుంటాయి. ఈ పరిణామాలపై యూఎస్ కోస్ట్ గార్డ్ సైబర్ కమాండ్ హెడ్, రియర్ అడ్మిరల్ జాసన్ టామా మాట్లాడుతూ, 'ఈ నౌకల వల్ల భౌతిక ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని మాకు కొన్నేళ్లుగా తెలుసు. అయితే, వాటిలో పొంచి ఉన్న సైబర్ ముప్పుల గురించి తనిఖీలు చేసే వరకు మాకు అవగాహన లేదు" అని పేర్కొన్నారు.

## శృంగేరి జగద్గురువు శ్రీ విధుశేఖర భారతి స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ గౌడ్



శ్రీ శృంగేరి శారదా పీఠం జగద్గురువులు శ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారి దివ్య అనుగ్రహంతో కర్ణాటకలో దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదా పీఠం లోని జగద్గురువులు శ్రీ విధుశేఖర భారతి స్వామివారిని దర్శించుకున్న బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ గౌడ్ ప్రత్యేక ఆశీస్సులు పొందినారు. ఈ సందర్భంగా జగద్గురువులను, శృంగేరి శారద మాతని ప్రార్థించి ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ గౌడ్, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఈ పూజా కార్యక్రమంలో శృంగేరి శిష్యులు రాచర్ల రవిచంద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో సుచిత్ర అకాడమీ షట్లర్ల సత్తా

## మిక్స్‌డ్ డబుల్స్‌లో నితిన్ కుమార్,లిఖిత శ్రీవాస్తవకు స్వర్ణ పతకం

## మహిళల డబుల్స్ లో లిఖితకు రజతం




సుచిత్ర బ్యాడ్మింటన్ అకాడమీ షట్లర్లు నితిన్ కుమార్, లిఖిత శ్రీవాస్తవ జాతీయ స్థాయి పోటీల్లో అద్భుత ప్రదర్శనతో మెరిశారు. పుణెలో జరిగిన యోనెక్స్‌సన్‌రైజ్ మెమోరియల్ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్2026లో మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో ఈ జంట వరుసగా రెండోసారి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకొని తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. టోర్నమెంట్ అంతటా సమన్వయంతో కూడిన ఆటతీరు, పట్టుదలతో నితిన్,లిఖిత జోడీ దేశంలోని అగ్రశ్రేణి షట్లర్లను ఎదుర్కొని విజేతలుగా నిలిచింది. ఇదే టోర్నమెంట్ లో లిఖిత శ్రీవాస్తవ మహిళల డబుల్స్ విభాగంలో శ్రేయ బాలాజీతో కలిసి పోటీ పడి రజత పతకాన్ని సాధించి మరోసారి తన ప్రతిభను నిరూపించింది. ఈ విజయానికి సుచిత్ర బ్యాడ్మింటన్ అకాడమీ వ్యవస్థాపకుడు ప్రదీప్ రాజు అందిస్తున్న నిరంతర ప్రోత్సాహం, మార్గదర్శకత్వం కీలకమని క్రీడాకారులు తెలిపారు. అలాగే ఇండోనేషియా జాతీయ జట్టు మాజీ సభ్యుడు, అకాడమీ డబుల్స్ హెడ్ కోచ్ ఎన్రో అందిస్తున్న అంతర్జాతీయ స్థాయి శిక్షణ తమ ఆటను మరింత మెరుగుపరచిందని పేర్కొన్నారు. క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు అత్యాధునిక శిక్షణా విధానాలు, ప్రణాళికాబద్ధమైన కోచింగ్‌తో సుచిత్ర బ్యాడ్మింటన్ అకాడమీ దేశ స్థాయిలో ప్రతిభావంతులైన షట్లర్లను తీర్చిదిద్దుతూ ముందుకు సాగుతోంది. నితిన్ కుమార్, లిఖిత శ్రీవాస్తవల విజయంపై సుచిత్ర బ్యాడ్మింటన్ అకాడమీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ, రానున్న జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్లలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## హైదరాబాద్ లో ఘనంగా ప్రారంభమైన హెచ్ఎస్‌బీసీ రగ్బీ ప్రీమియర్ లీగ్ సీజన్-2




దేశంలో అత్యున్నత ప్రొఫెషనల్ రగ్బీ టోర్నమెంట్‌గా గుర్తింపు పొందిన హెచ్ఎస్‌బీసీ రగ్బీ ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్) పవర్డ్ బై అవిడ్ సీజన్-2కు మంగళవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఘనంగా శ్రీకారం చుట్టారు. జీఎంఆర్ స్పోర్ట్స్, రగ్బీ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ లీగ్‌లో ఈసారి ఆరు పురుషుల ఫ్రాంచైజీలతో పాటు తొలిసారిగా నాలుగు మహిళల ఫ్రాంచైజీలను ప్రవేశపెట్టడం విశేషం. ప్రారంభోత్సవ వేడుకలో మహిళల ట్రోఫీని కూడా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ క్రీడలు, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, జీఎంఆర్ గ్రూప్ కార్పొరేట్ చైర్మన్ కిరణ్ కుమార్ గ్రంధి, రగ్బీ ఇండియా అధ్యక్షుడు రాహుల్ బోస్, సినీ నటి, గాయని శృతి హాసన్ తోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రధాన క్రీడా పోటీలకు తెలంగాణ రాష్ట్రం కేంద్రబిందువుగా మారిందని అన్నారు. ప్రపంచ స్థాయి క్రీడా మౌలిక వసతులు, ప్రగతిశీల క్రీడా విధానాల ద్వారా రాష్ట్రం క్రీడారంగ అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. మహిళల ఫ్రాంచైజీల ప్రవేశం రగ్బీ క్రీడాభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని పేర్కొన్నారు.

**ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్..** తెలంగాణను దేశంలో ప్రముఖ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అంతర్జాతీయ స్థాయి టోర్నమెంట్‌ల నిర్వహణకు హైదరాబాద్ అన్ని విధాలా సిద్ధంగా ఉందని చెప్పారు.

**స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి..** తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ వివిధ క్రీడా సంస్థలు జరుపుకునే క్రీడా ఉత్సవాలకు కార్యక్రమాలకు ఎంతో సహకరిస్తుంది అని తెలిపారు

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సోని బాలాదేవి.. రగ్బీ ప్రీమియర్ లీగ్ విజయవంత నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు, కార్యాచరణ సహకారం అందిస్తున్నట్లు తెలిపారు.

**రగ్బీ ఇండియా అధ్యక్షుడు రాహుల్ బోస్..** గత ఏడాది విజయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేలా ఈ సీజన్‌ను రూపొందించామని చెప్పారు. ఈసారి 20 దేశాలకు చెందిన ఆటగాళ్లు పాల్గొంటుండటంతో పాటు మహిళల లీగ్‌ను ప్రవేశపెట్టడం మరో ప్రత్యేకత అని పేర్కొన్నారు.

**జీఎంఆర్ స్పోర్ట్స్ సీఎంఓ సుజయ్ గంగూలీ..** భారతదేశంలో ప్రపంచ స్థాయి రగ్బీ వ్యవస్థను నిర్మించాలనే లక్ష్యంతో లీగ్‌ను విస్తరిస్తున్నామని తెలిపారు. జూన్ 16 నుంచి 28 వరకు గచ్చిబౌలి స్టేడియంలో జరిగే ఈ టోర్నమెంట్‌లో దేశ, విదేశాలకు చెందిన అగ్రశ్రేణి రగ్బీ క్రీడాకారులు పాల్గొననున్నారు. రాబోయే రెండు వారాల పాటు హైదరాబాద్ భారత రగ్బీ కేంద్రంగా మారనుంది అన్నారు.



